

ఇదేంటి జగనన్నా?

పోలవరం పరుగులెక్కడ ?

ఐదేళ్లకు ముందు శరవేగంగా సాగిన పోలవరం నిర్మాణ పనులు గత ఐదేళ్ల నుంచి మందగించాయి. మెట్ట ప్రాంతాన్ని గోదావరి జలాలతో తడపాలన్న ఆకాంక్షతో అప్పటి టీడీపీ ప్రభుత్వం గోదావరి ఒడ్డున ఎత్తిపోతలకు నిధులు ఇచ్చింది. పనులు శరవేగంగా నడిపింది. కాని ఈ పనులన్నీ ఇప్పుడు ఎక్కడికక్కడే.. సాగుకు యోగ్యమైన అవసరాలను ఇట్టే తీర్చేస్తామని చెబుతూనే అసలు వ్యవసాయమే దండగనే పరిస్థితికి వచ్చింది. నెలనెల ఇచ్చే సరుకుల్లోనూ కేవలం బియ్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఎంతో హంగుఆర్భాటంతో ప్రారంభించిన పనులన్నీ శిలాఫలకాలతో ఇప్పుడు అన్నిచోట్ల కనిపిస్తున్నాయి. పట్టాలు ఇచ్చారు కాని పక్కాఇళ్లు పత్తాలేకుండా పోయాయి. ఈ ఐదేళ్ల జగనన్న పాలనలో ఇవన్నీ సజీవ సాక్షీభూతాలు.

- (ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినా ఇతర ఎత్తిపోతల పథకాలు సకాలంలో అందుబాటులోకి వచ్చినా మెట్ట, డెల్టా ప్రాంతాలు సమాంతరంగా కళకళలాడేవి. పాడిపంటలు పెరిగేవి. ప్రజల జీవనశైలి మారి ఉండేది. సాగు, తాగునీటికి ఇప్పుడున్న కటకట పరిస్థితి వచ్చేదే కాదు. వీటికంటే మించి రైతులు, రైతులపై ఆధారపడ్డ ఆయా కుటుంబాలు ఒడ్డున పడేవి. ఆర్థికంగా కాస్తోకూస్తో కుదుటపడేవి. కాని ఈ ఐదేళ్ళుగా ఎక్కడ పనులు అక్కడే వదిలేశారు. పైపైకి మొసలికన్నీరు కారుస్తూ వచ్చారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం 2019కి ముందే సుమారు 78శాతం పనులను పూర్తి చేసే విధంగా ఏయేటికి ఆయేడే కాదు రోజువారి లక్ష్యాలను విధించుకుని ఆ మేరకు ఫలితాలను చేజిక్కించుకోవడానికి ప్రయత్నించింది. పోలవరం నిర్మాణం శరవేగంగా సాగుతుండగా రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, వర్గాల ప్రజలు ఏకబికిన సంతోషించారు. కాని ఈ ఐదేళ్లలో పోలవరం ఎక్కడికక్కడ పడకేసింది. నిర్మాణ పనులు అన్నీ మందకొడిగానే సాగాయి. కొన్ని పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కేంద్రబృందాలు డజన్లకొద్దీ ఈ ప్రాజెక్టునిర్మాణ స్థలికి వచ్చి పరిశీలన చేసి వెళ్లాయి. తప్పొప్పులను సరిదిద్దుకోవాల్సిన రాష్ట్రప్రభుత్వం ఆ పనేచేయలేదు. ఫలితంగా నిర్మాణ ప్రాంతం ఇప్పుడు సైలెంట్ అయింది. పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ఎన్నో గాలికబుర్లు చెప్పారు. హామీలు ఇచ్చారు. కాని ఈ ఐదేళ్లలో ఒక్కటి నిలుపుకుంటే ఒట్టు ఇదే విషయాన్ని టీడీపీతో సహా మిగతా ప్రతిపక్షాలు అన్ని నిలదీసినా బహిరంగంగా ప్రశ్నించినా జగన్ సర్కార్ సమాధానం ఇచ్చుకోలేక సతికిల పడింది. నిర్వాసితులకు ఇంకా వందల కోట్ల రూపాయలు పరిహారంగా చెల్లించాల్సి ఉంది. ఇప్పుడు ఆ వర్గాలు అన్నీ ఆగ్రహంతో ఊగిపోతున్నాయి. నిర్వాసిత కాలనీల్లోనూ అంతంతమాత్రంగానే నిర్మాణ పనులు, వసతులు వీటిపైన కూడా జనం భగ్గుమన్నా అధికారులు మాత్రం బేఖాతరు. ఇలా పోలవరంతో ముడిపడి ఉన్న సమస్యలు అన్నీ ఎక్కడికక్కడ పడకేశాయి. ఇంతకు ముందు పోలవరం సమస్యలు పరిష్కరించడానికి ఒక ప్రత్యేక బృందం ఉండేది. ఎప్పటికప్పుడు పనుల తీరును సమీక్షించుకునేది. కావాల్సిన అవసరాలను ప్రభుత్వానికి నివేదించేవారు. అప్పటి జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమా పదేపదే అధికారులతో సమీక్షించటం తక్షణ చర్యలకు దిగేవారు. కాని ఈ ఐదేళ్లలో ఇద్దరు సాగునీటి మంత్రులు మారినా.. పనుల పురోగతి సాధించలేకపోయాయి.

- ఎత్తిపోతలను ఎత్తేశారు..
- వ్యవసాయానికి వ్యతిరేక పరిస్థితులు రైతులను పట్టించుకున్నదెప్పుడు ?
- రేషన్‌లోనూ సరుకుల కోత ?
- ఈ ఐదేళ్లలో అంతా ఎడాపెడా?
- సమీక్షలు లేవు.. అంతకంటే సానుకూల ఫలితాలు లేవు
- జగనన్న పాలనలో సవాలక్ష సమస్యలు

వ్యవ'సాయం' గల్లంతేనా !



ఈ ఐదేళ్ల ప్రభుత్వహయాంలో వ్యవసాయ అనుకూల పరిస్థితులు మాని వ్యతిరేక పరిస్థితులు తాండవించాయి. పథకాల పేరిట చెల్లింపులే తప్ప అసలు, సిసలైన వ్యవసాయ కార్యాచరణను గాలికి వదిలేశారు. పంటల మద్దతు ధరకు తిరుగు ఉండదని, తామే అంతా చేసిపారేస్తామని అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు హామీ ఇచ్చినా రాష్ట్రప్రభుత్వం ఇప్పుడు ఆ వైపు తొంగి చూడడం లేదు. ధాన్యం కొనుగోళ్లలోనూ ఎక్కడికక్కడ చెల్లింపుల్లో జాప్యం కొనసాగిస్తూ వచ్చారు. రైతులు లబోదిబోమన్నా ఏ మాత్రం పట్టించుకుంటే ఒట్టు. రైతులకు ఇవ్వాల్సిన గౌరవం, ఏ మాత్రం లభించకపోగా తదానుగుణంగానే రైతులను ఇబ్బంది పెట్టేప్రయత్నం చేశారు. ఇప్పుడు సాగునీరు ఒక్కటే కాదు, రైతులకు మార్కెట్లో తగు మద్దతు ధర లభించని దీనస్థితిని ఎదుర్కొన్నారు. ధాన్యంతో పాటు పొగాకుకు ఇలాంటి పరిస్థితే వర్తించింది.


రేషన్ సరుకులు ఏవి ?



పౌరసరఫరాల విభాగం ద్వారా ప్రతినెల పేద ప్రజలకు అందించే రేషన్ సరుకుల్లోనూ ఎడాపెడా కోతలు పెట్టారు. ముందేమో ఇక సన్నిబియ్యమేనంటూ గొప్పలు పలికారు. పేదల ఇంట సరుకుల కొరత ఉన్నదంటూ కందిపప్పు, పంచదార, మైదాపిండితో సహా కొద్దినెలల పాటే అందించి రానురాను మొత్తం సీన్ మార్చేశారు. తెలుపురంగు కార్డు కలిగిన వారందరికి ఏదో ఇస్తున్నామన్నట్టుగా బియ్యం అందించారే తప్ప కందిపప్పు అడ్రస్ లేకుండా పోయింది. పంచదార అంతంత మాత్రమే అయింది. ఈ ఐదేళ్లలో రేషన్‌సరుకుల ద్వారా పేదలకు అందించింది ఏదీ లేదు. జిల్లా వ్యాప్తంగా రేషన్ బియ్యం టన్నులకొద్ది సరిహద్దులు దాటింది.


ఎత్తిపోతలు.. ఎత్తేశారుగా ?

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాతో పాటు పొరుగున ఉన్న ఉమ్మడి కృష్ణాలోనూ.. మెట్టప్రాంతాన్ని గోదావరి జలాలతో తడపాలని భావించినా అప్పటి రాష్ట్రప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని భారీగా విస్తరించింది. ధైర్యంచేసి భూసేకరణలో రైతులను ఒప్పించే ప్రయత్నం చేసింది. ఏకంగా నాలుగు వేల కోట్లకుపైగా నిర్మాణ వ్యయాన్ని అమాంతం పెంచింది. దీనికి తగ్గట్లుగానే గోదావరి ఒడ్డున ఎత్తిపోతల హెడ్‌వర్క్స్ నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టింది. అక్కడినుంచి కిలోమీటర్ల మేర సాగే ఈ ఎత్తిపోతల పథకానికి రిజర్వాయర్‌లను నిర్మించాలని తలపెట్టింది. వీటన్నింటికి పరిపాలన ఆమోదం ఇచ్చింది. చింతలపూడి ఎత్తిపోతల ఈ ఐదేళ్లలో ఐదడుగుల పనికూడా నోచుకోలేదు. ఎక్కడికక్కడ పనులన్ని నిలిచాయి. రైతులు, రాజకీయపక్షాలు పదేపదే డిమాండ్ చేసినా.. నిరసన వ్యక్తం చేసినా.. అది ఇంకా అధికారులకు కాని అటు ప్రభుత్వానికి కాని పట్టనే లేదు. చింతలపూడి ఎత్తిపోతల పనులు అన్నీ ఈవిధంగా స్తంభించిపోవడంతో గోదావరి జిల్లాలతో పాటు అటు కృష్ణా జిల్లాలోనూ ప్రత్యేకించి ఏలూరు లోక్‌స్థానం పరిధిలో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. ఇదే విషయాన్ని తాజాగా ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి దిగిన పుట్టా మహేష్‌యాదవ్ తన ఎన్నికల ప్రచారంలోనూ ప్రస్తావిస్తున్నారు. పోలవరం, చింతలపూడి ఎత్తిపోతలను తనను గెలిపిస్తే పూర్తిచేసి చూపిస్తానంటూ ప్రజలను కలుస్తున్నారు. బీజేపీ, జనసేన నేతలు కూడా ఈ మధ్యనే నిరసన గళం పెంచారు.



తణుకులో ప్రజాగళం

- రోడ్ షో, భారీ బహిరంగ సభ
- నేడు హాజరుకానున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్
- అనంతరం నిడదవోలు వరకు రోడ్ షో, సభ







తణుకులో హెలీప్యాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి

భీమవరం/తణుకు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ ప్రజాగళం బహిరంగ సభకు తణుకు ముస్తాబైంది. ఈ సభకు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌కల్యాణ్ హాజరుకానున్నారు. వీరిద్దరూ వేర్వేరు హెలీకాఫ్టర్‌లలో బుధవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు తణుకు పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసి హెలీప్యాడ్‌లో ల్యాండ్ కానున్నారు. ఇక్కడి నుంచి పట్టణంలోని నరేంద్ర సెంటర్ వరకు రోడ్ షో నిర్వహిస్తారు. నాలుగు గంటలకు సభ మొదలై ఐదున్నర గంటలకు ముగుస్తుంది. అనంతరం రోడ్డు మార్గంలోనే నిడదవోలు గణపతి సెంటర్‌కు చేరుకుని రాత్రి ఏడు గంటలకు జరిగే బహిరంగ సభలో మాట్లాడతారు. ఈ సభలో కూటమి నుంచి రాజమండ్రి ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొంటారు. సభ పూర్తయిన తర్వాత చంద్రబాబు నిడదవోలు తిరుమల సాయి కల్యాణ మండపంలో బస చేస్తారు. పవన్ కల్యాణ్ రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో బస చేస్తారు. గురువారం ఉదయం చంద్రబాబు ఉభయ గోదావరి జిల్లాల నేతలతో నిడదవో లులో సమీక్ష జరిపి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశా నిర్దేశం చేస్తారు.

తణుకు సభకు భారీ ఏర్పాట్లు

తణుకులో జరిగే ప్రజాగళం సభకు జిల్లా నలుమూలల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యేలా కూటమి నేతలు ఏర్పాట్లు చేశారు. రాధాకృష్ణ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లను తణుకు మాజీ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు.

జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 9 : సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 88.60 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ 22 వేలు రూపాయలు అని తెలిపారు. బెల్లపు ఊట 1200 లీటర్లు స్వాధీనం. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు ఏడు లక్షల 61 వేల 460 రూపాయలు అని తెలిపారు.

టీడీపీలోకి గ్రామ వలంటీర్



పెదవేగి, ఏప్రిల్ 9 : దెందులూరు మండలం చల్లచింతలపూడి గ్రామ వలంటీర్ పజ్జూరి రాంబాబు వలంటీరు పదవికి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. పెదవేగి మండలం దుగ్గిరాలలో జరిగిన కార్యక్రమంలో రాంబాబుకు చింతమనేని ప్రభాకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు చూసి తట్టుకోలేకే ఆ పార్టీని వీడానని రాంబాబు తెలిపారు. చింతమనేని సారథ్యంలో టీడీపీతోనే సంక్షేమ పాలన సాగుతుందనే నమ్మకంతోనే చేరానన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ నాయకులు కమ్మ శివరామకృష్ణ, తాతా సత్యనారాయణ, తలకొండ జమలయ్య, మోదుగుమూడి రాంబాబు, పండు, వేమన రాము, గొల్లపల్లి ములగయ్య పాల్గొన్నారు.

■ ఆంధ్రజ్యోతితో ఆఫీసర్

బందోబస్తుకు ప్రణాళిక

పోలవరం డీఎస్పీ సురేష్ కుమార్ రెడ్డి



- ఎన్నికల బందో బస్తు కోసం సబ్ డివిజన్ పరిధిలో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. అవసరాన్ని బట్టి ఎస్పీ ఆదేశాల మేరకు సిబ్బందిని సమకూర్చుకుంటాం.
- సబ్ డివిజన్ పరిధిలో 1,390 బైండోవర్ కేసులు నమోదు చేశాం. 87 మంది రౌడీ షీటర్లకు గాను 73 మందిపై ముందస్తు కేసులు నమోదు చేశాం. 49 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. ఆ పరిధిలో ఎస్ఐ ఎన్నికల అధికారులతో శాంతి కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.
- 'సీ'విజిల్ యాప్ ద్వారా వచ్చే సమాచారాల మేరకు డబ్బు, మద్యం, ఇతరత్రా ప్రలోభ వస్తువుల రవాణా పట్ల నిఘా పెంచాం. తెలంగాణ నుంచి రాష్ట్రంలోకి రానీయకుండా నాలుగు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. చెకింగ్ ప్రక్రియలను వీడియో రికార్డింగ్ చేస్తున్నారు.
- ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల సరిహద్దులో ఇటీవల రెండు ఎన్‌కౌంటర్లు జరిగిన నేపథ్యంలో ఆ ప్రాంతం నుంచి మావోయిస్టులు మన రాష్ట్రంలోకి ప్రవేశించి పాపి కొండల అడవుల్లో, ముంపు గ్రామాల్లో తలదాచుకునే అవకాశాలున్న నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించాం.
- మహిళా పోలీస్ కొరతకు ప్రత్యామ్నాయంగా ఎస్పీ ఆదేశాల మేరకు హోంగార్డులను వినియోగిస్తాం. సచివాలయ మహిళా పోలీసులను వినియోగించరాదని ఎన్నికల నియమావళిలో ఉంది. ఈసీ ఆదేశాలు ఇస్తే వినియోగిస్తాం.

- పోలవరం

ఒక్క ధాన్యం గింజ కొనలేదు

- కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యంతో రైతులకు నష్టం
- జిల్లాలో 120 కేంద్రాల ఏర్పాటు
- 8వ తేదీ నుంచి కేంద్రాలు ప్రారంభం
- ఇప్పటివరకు ఒక్క గింజ కొనుగోలు చేయలేదని రైతు సంఘాల ఆరోపణ
- మార్చి 20 నుంచే వరి కోతలు ప్రారంభమయ్యాయన్న రైతు సంఘాలు



ఏలూరుసిటీ, ఏప్రిల్ 9: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం నుంచి ప్రారంభించారు. సాధారణంగా జిల్లాలో వరి కోతలు మార్చి 20 నుంచే ప్రారంభమయ్యాయని ఇప్పటిరవకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మి నష్టపోయారని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి. ఎప్పుడో ఏర్పాటు చేయాల్సిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆలస్యం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాతావరణ పరిస్థితులలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం కళ్ళాల్లోని ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. జిల్లాలోని భీమడోలు, ఉంగుటూరు మండలాల్లో మార్చి 20 నుంచి వరి కోతలు ప్రారంభమయ్యాయని, అయిన కాడిన ధాన్యాన్ని రైతులు అమ్ముకోవాల్సి వచ్చిందని, 75 కిలోల బస్తా రూ.1,250 నుంచి రూ.1,350కు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని రైతు సంఘాలు చెబుతున్నాయి.



ఉంగుటూరులో ఆరబెట్టిన ధాన్యం

జిల్లాలో 120 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో 239 ఆర్‌బీకేలకు సంబంధించి 120 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని జిల్లా పౌరసరఫరాల సంస్థ ఉన్నతాధికారులు చెబుతున్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ళు ప్రారంభమయ్యాయని, వరి కోతలు పూర్తయిన ప్రాంతాల్లో కొనుగోళ్లు ప్రారంభించామని చెబుతున్నారు. జిల్లాలో నిడమర్రు, భీమడోలు, ఉంగుటూరు, దెందులూరు మండలాల్లో వరి కోతలు జరుగుతున్నాయని ఆయా ప్రాంతాల్లో కొనుగోళ్ళు ప్రారంభమయ్యాయన్నారు. జిల్లాలో 80వేల ఎకరాల్లో రబీ వరి సాగు చేయగా 3.12 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో ఈ ఏడాది 2.40 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ధేశించుకున్నారు. జిల్లాకు సంబంధించి 77 లక్షల గోనె సంచులు అవసరం కాగా ఇప్పటివరకు 40 లక్షలు గోనె సంచులు సిద్ధంగా ఉంచామని అధికారులు చెబుతున్నారు. ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాలకు రూ.2,203, కామన్ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,183 మద్దతు ధర ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

జాప్యం వల్ల రైతులకు నష్టం

ధాన్యం కొనుగోళ్ళలో జాప్యం జరిగింది. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవక పోవడం వల్ల 75 కిలోల బస్తా ధాన్యాన్ని రూ.1,250 నుంచి రూ.1,350కు అమ్ముకోవాల్సి వచ్చింది. ఇప్పటికైనా కళ్ళాల్లోని ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లులకు పంపాలి. ఎక్కువ రోజులు ఆరబెట్టడం వల్ల ధాన్యంలో ఆరుదల ఎక్కువ కావటంతో తేమశాతం పూర్తిగా పడిపోయి నూకలు పెరిగే అవకాశం ఉంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదు.

- కె.శ్రీనివాస్, ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి



కుంకుళ్లమ్మకు గాజుల అలంకరణ

శ్రీవారి క్షేత్రదేవతగా విరాజిల్లుతోన్న కుంకుళ్లమ్మ ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి, దీనిలో భాగంగా అమ్మవారికి లక్ష గాజుల అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు.

- ద్వారకాతిరుమల

కార్యకర్తలు ఆదేశిస్తే పార్టీని వీడతా

- ఉండి సీటు మార్పుపై ఎమ్మెల్యే రామరాజు కంటతడి



కాళ్ళ, ఏప్రిల్ 9 : సిట్టింగ్ ఎమ్మెల్యేగా మొదటి లిస్టులోనే అభ్యర్థిగా ప్రకటించిన తనను మళ్లీ మార్చాలనుకోవడం దారుణమని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు ఆవేదన వ్యక్తం చేశారు. పెదఅమిరం నిర్మలా దేవి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. టీడీపీ అధిష్ఠానం ఉండి సీటుకు అభ్యర్థిని మార్చే ఆలోచన వుందని తెలుసుకున్న కార్యకర్తలు సభలో నేలపై బైఠాయించి నినాదాలు చేశా రు. సీటు మారిస్తే ఊరుకోబోమని పరిశీలకులుగా వచ్చిన ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, కొత్త నాగేంద్రకుమార్‌లను కార్యకర్తలు చుట్టుముట్టి నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ అధిష్ఠానం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, కొత్తగా వచ్చిన వేరే వ్యక్తికి సీటు కేటాయిస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యకర్తలు ఆదేశిస్తే పార్టీని వీడడానికి వెనుకాడనన్నారు. ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండడమే నేను చేసిన తప్పా అంటూ కంటతడి పెట్టారు. పరిశీలకుడు గన్ని మాట్లాడుతూ కార్యకర్తల ఆవేదనను అధినాయకుడి దృష్టికి తీసుకుని వెళతానన్నారు. రాష్ట్రంలో జగన్ దుర్మార్గపాలనను అంతమొందించేందుకు కూటమి ఏర్పడిం దని, ఇందులో భాగంగానే ఉంగుటూరులో తన సీటును కూడా కోల్పోవాల్సి వచ్చిందని అన్నారు. అవసరమైతే త్యాగాలకు సిద్ధపడాలన్నారు.





ఏలూరులో ఉగాది పూజల్లో కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్, వృద్ధులకు వస్త్రాలు పంపిణీ దృశ్యం

మనదే గెలుపు : ఎంపీ అభ్యర్థి పుట్టా

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 9: 'వచ్చే ఎన్నికల్లో మనదే గెలుపు, కలిసి పనిచేద్దాం, విజయం మనదే' అని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులతో కలిసి మంగళవారం ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఉగాది పండుగ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేస్తే అద్భుత విజయం సాధిస్తామన్నారు. ప్రజల మద్దతు కూటమికే ఉందన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించారు. చంటి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నా రన్నారు. ప్రజల కష్టాల నుంచి బయటపడాలని పూజలు చేశామన్నారు. ఏపీ ప్రజలకు రాబోయే రోజుల్లో సుఖశాంతులతో గడుపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కైకలూరులో నూతన ఎన్‌డీఏ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌తో కలిసి పుట్టా మహేష్‌యాదవ్ ఉగాది పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాదిగా వైసీపీ నాయకులు ఎన్‌డీఏ కూటమిలో చేరారు. వారందరికీ బీజేపీ ఏపీ ఎన్నికల ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సింగ్ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్ సీటును కూటమి ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ భారీ మెజారిటీతో గెలవబోతున్నారన్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. అనంతరం ఏలూరులోని మాదేపల్లి ప్రేమాలయం వృద్ధాశ్రమంలో వృద్ధులకు బట్టలు, నిత్యావసర సరుకులు మహేష్‌యాదవ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కార్యకర్తలు, పాల్గొన్నారు.

రూ.12.45 కోట్ల విలువైన నగదు, బంగారం సీజ్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ఏలూరుసిటీ, ఏప్రిల్ 9 :ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా రూ.12.45 కోట్లు విలువైన నగదు, బంగారం , వెండి, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వై.ప్రసన్నవెంకటేష్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ నగదు, మద్యం, ఉచిత సామగ్రి పంపిణీ తదితరాలను నిరోధించే నిమిత్తం జిల్లావ్యాప్తంగా 45 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, 28 స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్‌తో పాటు రాష్ట్ర సరిహద్దుల వద్ద పది ఎస్ఎస్‌టీ బృందాలతో పటిష్టమైన నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇందులో రూ.151.61 లక్షలు నగదు, రూ.10.17 కోట్ల విలువైన బంగారం, వెండి వస్తువులు, రూ.71.53 లక్షల విలువైన 27,800 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలోఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ యాప్ ద్వారా సోమవారం రాత్రి వరకు 1,015 అభ్యర్థనలు రాగా వాటిలో ఇంతవరకు 691 అనుమతులు జారీ చేయగా, మరో 21 పరిశీలనలో ఉన్నాయన్నారు. సరైన రీతిలో దరఖాస్తు చేయని 303 తిరస్కరించబడ్డాయన్నారు. సి-విజిల్ ద్వారా 287 ఫిర్యాదులు అందగా వాటిలో 186 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. మరో 101 ఎన్నికలకు సంబంధం లేని ఫిర్యాదులు తిరస్కరించబడ్డాయన్నారు. మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలకు వచ్చిన 85 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. ఇప్పటివరకు 43 మంది సిబ్బందిపై చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ఏలూరు కలెక్టరేట్‌లో జిల్లా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.


క్రికెట్ క్రీడలో పాల్గొన్న నిట్ విద్యార్థులు, ఆచార్యులు

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 9 : విద్యార్థులు చదువుతో పాటూ క్రీడల్లోనూ రాణించాలని ఏపీ నిట్ డీన్ (స్టూడెంట్స్ వెల్ఫేర్) డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్ అన్నారు. నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం సహకారంతో నిట్ ప్రాంగణంలో వారం రోజుల పాటు నిర్వహించే క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. వీరేష్‌కుమార్ మాట్లాడుతూ స్నేహపూర్వక క్రికెట్ పోటీలు ఆచార్యులు, విద్యార్థుల మధ్య వారధిగా నిలుస్తాయన్నారు. విద్యార్థులతో పాటూ ఆచార్యులు, సిబ్బంది కూడా పాల్గొంటారన్నారు. మొత్తం 8 జట్లు తలపడతాయన్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్ కిరణ్ తీపర్తి,ఆచార్యులు డాక్టర్ వీ.సందీప్, డాక్టర్ సుదర్శన్‌ధ్రువ, సాస్ అసిస్టెంట్‌లు డాక్టర్ వీ.శ్రీనివాస్, సాయిరాం, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఉద్యాన పంచాంగం ఆవిష్కరించిన జవహర్‌రెడ్డి



తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 9: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రచురించిన క్రోధి నామ సంవత్సర ఉద్యాన పంచాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగళవారం విజయవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యాన పంటల అభివృద్ధికి విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని అభినందించారు. విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ టి.జానకీరామ్, రిజిస్ట్రార్ శ్రీనివాసులు, విస్తరణ సంచాలకులు కరుణశ్రీ పాల్గొన్నారు.


విజయరాయి సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

రూ.5,71,500 సీజ్

పెదవేగి, ఏప్రిల్ 9 : ఎన్నికల స్క్వాడ్ బృందాలు ఎక్కడికక్కడ విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. సరైన ఆధారాలు లేకుండా పరిమితికి మించి తరలిస్తున్న నగదును సీజ్ చేస్తున్నారు.ఫ్లయింగ్ స్క్వాడ్-3 అధికారి బి.నరసయ్య, పెదవేగి ఎస్ఐ రాజేంద్రప్రసాద్‌లు సిబ్బందితో కలిసి పెదవేగి మండలం విజయరాయి సమీపంలో బలివే అడ్డరోడ్డు దగ్గర మంగళవారం ఉదయం వాహనాల తనిఖీ చేస్తున్నారు. అనపర్తి నుంచి ధర్మాజీగూడెం మీదుగా ఏలూరువైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న చందురెడ్డి, శంకర్రావు దగ్గర ఎటువంటి ఆధారిత పత్రాలు లేని రూ.1,35,400 నగదును గుర్తించి సీజ్ చేసినట్టు పెదవేగి తహసీల్దారు సూర్యప్రభ తెలిపారు. అలాగే లింగపాలెం మండలానికి చెందిన పాస్టర్ ఏలియ్య కారులో రూ.1.50 లక్షలను గుర్తించి సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన సొమ్మును ఏలూరు జిల్లా ట్రెజరీలో జమచేశామని సరైన ఆధారాలు చూపిస్తే ఆ నగదును తిరిగి ఇచ్చేస్తామని ఆమె వివరించారు.

కొత్తూరు వద్ద ఇద్దరి నుంచి రూ.2.15 లక్షలు



కామవరపుకోట : కొత్తూరు ఎన్నికల చెక్‌పోస్టు వద్ద మంగళవారం అది కారులు ఇద్దరు వ్యక్తుల నుంచి రెండు లక్షల 15 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెక్ పోస్టు ఇన్‌చార్జి కొయ్యగూర బాబూరావు తెలిపారు. రావికంపాడుకు చెందిన వ్యక్తి నుంచి 60 వేలు, పాతగండి గూడేనికి చెందిన మహిళ నుంచి లక్షా 55 వేలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఫ్లయింగ్ స్కాడ్ అధికారి పి.వీరాస్వామి, తడికల పూడి కానిస్టేబుళ్లు కె.రమేష్,కె.రామకృష్ణ ఎం. నాగార్జున, షేక్ నాగూర్ సాయి తదితరులు ఉన్నారు.

ఉంగుటూరులో రూ.71,500

ఉంగుటూరు :ఉంగుటూరులో ఫ్లయింగ్ స్క్వాడ్ మంగళవారం సాయంత్రం అమలాపురం నుంచి హైదరాబాదుకు వెళుతున్న వాహనాన్ని తనిఖీ చేయగా అనుమతిలేని నగదు రూ.71,500 స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాత్రి టోల్ గేట్ సమీపంలో వాహనాన్ని తనిఖీ చేయగా వారి నుంచి రూ.1,41,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు నిడమర్రు సీఐ మోగంటి వెంకట సుభాష్, చేబ్రోలు ఎస్సై మణి కుమార్‌లు తెలిపారు.

26.64 లక్షల విలువైన మద్యం పట్టివేత


మద్యం తరలిస్తూ అల్లిపెల్లి చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన వాహనం

చింతలపూడి, ఏప్రిల్ 9: చింతలపూడి మండల సరిహద్దు అల్లిపెల్లి చెక్ పోస్టు వద్ద 26 లక్షల 64 వేల 320 రూపాయల విలువైన అనుమతులు లేకుండా తీసుకు వెళుతున్న మద్యాన్ని ఎస్.ఎస్ టీమ్ మంగళవారం పట్టుకు న్నట్లు సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ తెలిపారు. 3,546 లీటర్లు, 16,284 బాటిల్స్‌లో తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ఏలూరు ఎమ్మార్సీ గోడౌన్ నుంచి ఈ మద్యాన్ని తీసుకు వెళుతున్నట్లు డ్రైవర్ చెబుతున్నాడు. అయితే పత్రాలు లేకపోవడంతో మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఎస్ఈబీ అధికారులకు అప్పగించినట్టు తెలిపారు. ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్‌లో ఈ మద్యాన్ని నమోదు చేసినట్టు తెలిపారు.

8-04-2024
పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	242	225	234.42
జంగారెడ్డిగూడెం-1	242	235	240.10
జంగారెడ్డిగూడెం-2	242	235	239.68
కొయ్యలగూడెం	243	235	240.01
గోపాలపురం	242	235	239.52

కన్నీటి కష్టాలు


ఎల్ఎన్‌పురంలో రక్షిత మంచినీటి సరఫరా కేంద్రం ఫిల్టర్ బెడ్‌లో పచ్చరంగులోకి మారిన తాగునీరు

ఎల్ఎన్ పురంలో కలుషిత నీరే దిక్కు

కాళ్ళ, ఏప్రిల్ 9 : కాళ్ళ మండలం ఎల్ఎన్ పురంలో రక్షిత మంచినీటి సరఫరా కేంద్రం ద్వారా కలుషిత నీరు సరఫరా చేస్తుండటం అధికారుల అలసత్వాన్ని తెలియజేస్తున్నది. కొద్ది రోజులుగా కుళాయిల్లో రంగుమారి, దుర్వాసనతో నీరు సరఫరా అవుతోంది. రంగు మారిన నీటినే సరఫరా చేయడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఈ నీటిని తాగేందుకు ప్రజలు భయపడుతున్నారు. ప్రజారోగ్యంతో అధికారులు చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించి ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.దీనిపై పంచాయతీ కార్యదర్శి హసీనా మాట్లాడుతూ రక్షిత మంచినీటి సరఫరా కేంద్రం వద్ద వాల్‌ఫిట్ రిపేరు రావడంతో ఇబ్బంది తలెత్తింది. దానిని బాగు చేసే పనిలో నిమగ్నమయ్యాం. ఫిల్టర్ బెడ్స్‌ని కూడా క్లీనింగ్ చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

నెల రోజులుగా ఇదే పరిస్థితి



గ్రామంలో సుమారు నెల రోజులు పైబడి రంగు మారి దుర్వాసనతో కూడిన తాగునీరు కుళాయిల ద్వారా వస్తుంది. ఈ నీరు తాగటం వల్ల ప్రజలంతా ఇబ్బంది పడుతున్నారు.
-వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్, ఎల్ఎన్‌పురం

ప్రజల ప్రాణాలతో చెలగాటం



రక్షిత మంచినీటి సరఫరా కేంద్రం నిర్వహణ సరిగా లేకపోవడంతో పూర్తిగా కలుషితమైన జలాలు కుళాయిల ద్వారా వస్తుంది. ఈనీరు తాగి ప్రజలకు ఏమైనా అయితే ఎవరు బాధ్యులు..? అధికారులు, పాలకవర్గం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.
-బి.నరసింహస్వామి, మాజీ ఎంపీటీసీ, ఎల్ఎన్‌పురం

మంచినీటి చెరువులకు నీరివ్వండి

కాళ్ళ, ఏప్రిల్ 9 : వెంకయ్య వయ్యేరు పంట కాలువలో గుర్రపుడెక్క, తూడు మేట వేయడంతో పాటు మట్టి పేరుకుపోయింది. దీంతో పది గ్రామాల ప్రజలకు తాగునీరు అందించే అన్నయ్యకోడు ఛానల్ మురుగు కాలువగా తయారైంది. మంచినీటి చెరువులకు పూర్తిస్థాయిలో నీటిని నింపేందుకు 20 రోజులపాటు వంతుల వారీలో నీటిని అందించాలని కలవపూడి సర్పంచ్ గేదల జాన్ ఇరిగేషన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. కలవపూడిలో పూర్తిగా అడుగంటిన మంచినీటి చెరువు, అన్నయ్యకోడు, వెంకయ్య వయ్యేరు పంట కాలువలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను కలిసి తాగునీటి సమస్యను వివరించామన్నారు. గోదావరిలో నీరు లేదని సీలేరు జలాల నుంచి అందించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారన్నారు. వంతులవారీలో మరో 20 రోజులపాటు నీటిని అందించాలని, చేపలు, రొయ్యలు, చెరువు రైతులకు నోటీసులు ఇచ్చి పంట కాలువపై అధికారుల పర్యవేక్షణ ఉంటేనే చెరువులకు నీరు నింపుకొనే అవకాశం ఉందన్నారు.


కలవపూడిలో అడుగంటిన చెరువు


చెరుకుమిల్లిలో మోటార్లు బిగించుకుంటున్న రైతులు

మోటార్ల సాయంతో నీరు

ఆకివీడు రూరల్ ఏప్రిల్ 9 : దాళ్వా సాగుకు నీటి ఎద్దడితో రైతుల ఇబ్బం దులు పడుతున్నారు. కాలువలో నీటి మట్టం లేకపోవడంతో పాలు పోసుకునే సమయంలో నీటిని అందించేందుకు రైతులు మోటారులపై ఆధార పడు తున్నారు. ఆకివీడు మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో అద్దెకు మోటార్లు తీసుకుని వచ్చి నీటిని తోడుకుంటున్నట్లుగా రైతులు తెలిపారు. ఇప్పటికే మూడువంతుల వ్యవసాయభూముల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. ఉన్న అరకొర వ్యవసాయం భూములు సాగు సమయంలో నీరందక రైతులు కష్టాలు పాల వుతున్నారు. నీటి పారుదల శాఖాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చెయ్యడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఉన్నతాధికారులు ఎన్నికల మీద దృష్టి పెట్టినందున కిందిస్థాయి సిబ్బంది విధి నిర్వహణపై శ్రద్ధ చూపించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని సాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని కోరుతున్నారు.

మూడురోజులకోసారి కుళాయి

శివారు గ్రామాల్లో దాహం దాహం..

కలిదిండి, ఏప్రిల్ 9 : జిల్లాకు శివారు గ్రామాలైన పెదలంక, మూల్లంక, భాస్కరరావుపేట గ్రామాల్లో తాగునీటి చెరువులు అడుగంటాయి. ప్రస్తుతం మూడు రోజులకొకసారి కుళాయిలను వదులుతున్నారు. ఫిల్టర్ చేయకుండా నేరుగా బురద నీటిని వదలటంతో అవి స్నానం చేస్తుంటే దురద వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయా గ్రామాల్లో తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలంటే సీబీ కెనాల్‌కు కనీసం 400 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉండగా సోమవారం కేవలం 270 క్యూసెక్కులు మాత్రమే విడుదల కావటంతో అవి ఏ మూలకూ రాలేదు. వారం రోజులపాటు నిరంతరాయంగా తాగునీటి వంతు సరఫరా చేయాలని సర్పంచ్‌లు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితిలో సీబీ కెనాల్‌కు సమృద్ధిగా తాగునీరు విడుదల చేసే పరిస్థితి కన్పించటం లేదని ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరిలో పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువు వద్దకు వంతులవారీ నీరు చేరకపోవటంతో ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పొలు పేట వద్ద కాల్వలో మోటార్ పంపు సెట్‌లతో నీరు తోడినప్పటికీ పెదలంక తాగునీటి వద్దకు చేరలేదు.ఉమ్మడి కృష్ణా జిల్లాకు శివారు పశ్చిమ గోదావరి సరిహద్దున ఉప్పుటేరు పక్కన ఉన్న పెదలంకలో 8 ఎకరాల విస్తీర్ణం కలిగిన తాగునీటి చెరువు పూర్తిగా అడుగంటింది. ఈ సారి తాగునీటి వంతు చెరువు వద్దకు చేరితేనే చెరువును నింపటానికి అవకాశం ఉంటుందని,పెదలంక తాగునీటి చెరువును నింపటానికి అధికారులు ప్రాధాన్యమివ్వాలని సర్పంచ్ మోకా లక్ష్మీ, గ్రామస్థులు కోరుతున్నారు.


పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువు

నేత్రపర్వం..శ్రీవారికి ఉగాది ఉత్సవం

శేషవాహనంపై ఊరేగిన శేషాచల వాసుడు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 9: ద్వారకాతిరుమలేశుని క్షేత్రంలో స్వామివారికి ఉగాది ఉత్సవం మంగళవారం రాత్రి రమణీయంగా జరిగింది. గరుడాళ్వార్ కూడలిలో ఉన్న ఉగాది మండపంలో ఆలయ అర్చకులు వేడుక నిర్వహించారు. ముందుగా సాయంత్రం ఆలయంలో ఉభయదేవేరులు, గోదాదేవితో కలసిన శ్రీవారి మూర్తులను వెండి శేషవాహనంపై ఉంచి అర్చకులు ప్రత్యేక అలంకారం చేశారు. మేళతాళాలు, సన్నాయివాయిద్యాలు వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా శ్రీవారు కొలువుదీరిన వాహనం ఉగాది మండపం వద్దకు చేరింది. స్వామి, అమ్మవార్లకు భక్తులు నీరాజనాలు సమర్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఏర్పాటు చేసిన రజిత సింహాసనంపై శ్రీవారి మూర్తులను ఉంచి అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు, పండితులు పంచాంగ శ్రవణం చేశారు ఆలయ చైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు ఆధ్వర్యంలో ఈఓ త్రినాథరావు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కిటకిటలాడిన ఆలయాలు

ద్వారకాతిరుమల /జంగారెడ్డిగూడెం/భీమవరం టౌన్ ఏప్రిల్ 9: ఉగాది పర్వదినం పురస్కరించుకుని మంగళవారం ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ద్వారకాతిరరుమల చినవెంకన్న క్షేత్రానికి తెల్లవారు జాము నుంచి భక్తుల రాక ప్రారంభమైంది. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయానికి వచ్చిన వారికి దేవస్థానం తీర్థ వినియోగ ప్రాంతంలో ఉగాది పచ్చడిని పంపిణీ చేసింది. క్షేత్రదేవతగా విరాజిల్లుతోన్న శ్రీకుంకుళ్లమ్మ ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు మంగళవారం కన్నులపండువగా ప్రారంభమయ్యాయి, ఈ సందర్భంగా అమ్మవారు లక్ష గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈనెల 18న కుంకుమపూజ, చండీహోమం జరుగుతుందని అర్చకులు భైరవస్వామి తెలిపారు.


పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దర్శనార్థం భక్తులు బారులు తీరారు. మంగళవారం ఉగాది కలిసి రావడంతో వేలాది మంది స్వామివారి దర్శనానికి విచ్చేశారు.అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు పంచాంగ శ్రవణం కార్యక్రమమును ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ప్రారంభించారు. ప్రత్యేక పూలతో అలంకరించిన మండపంపై స్వామివారిని ఆసీనులను చేసి, అర్చక స్వాములు పంచాంగ శ్రవణం నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన తమలపాకులతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు ఉదయం ఆరాధన, తోమాలసేవ తదితర పూజాది కాల అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు.

భీమవరం మావుళ్లమ్మ ఆశీస్సులను అందుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తుల క్యూలైన్ పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు చేరిపోయింది. ఎండ సైతం లెక్కచెయ్యకుండా అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో పండితులు పంచాంగ శ్రవణం చేశారు.


మావుళ్లమ్మ ఆలయం వద్ద క్యూలో భక్తులు


మద్ది ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తజనం



ముని మనవడికి 108 రకాల పదార్థాలతో స్వాగతం

బుట్టాయగూడెం, ఏప్రిల్ 9: 108 పండి పదార్థాలు, మధుర ఫలాలు, తినుబండారాలతో ముని మనవడికి తాత స్వాగతం పలికిన సంఘటన మంగళవారం మర్లగూడెంలో జరిగింది. మర్లగూడెంకు చెందిన రిటైర్డు పోస్టుమాస్టర్ కనిగొల్ల దుర్గారావు, ధనలక్ష్మీల ముని మనవడు నాగ సూర్య ప్రవీణ్‌కు 108 రకాల రకాల తినుబండారాలతో స్వాగతం పలికారు. పెద్ద కుమార్తె కూతురు లిఖితప్రియ కుమారుడైన నాగ సూర్య ప్రవీణ్ మొదటిసారిగా మర్లగూడెం తన ఇంటికి రావడంతో ఏర్పాట్లు చేసినట్లు దుర్గారావు తెలిపారు. ఉగాది రోజున ఇలా చేయడం ఆనందంగా ఉందన్నారు.



ఆటో బోల్తా.. ఇరువురికి గాయాలు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 9: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. నూజివీడు మండలం అన్నవరం గ్రామంలో నూజివీడు నుంచి విస్సన్నపేట వైపు వస్తున్న ఆటో వెంకటాయపాలెం నుంచి వస్తున్న బైక్ ఢీకొన్నాయి. దీంతో ఆటో పల్టీకొట్టడంతో ఆటోలో ఉన్న డ్రైవర్ బాపులపాడు మండలం కొత్తపల్లికి చెందిన కృష్ణతో పాటు ద్విచక్రవాహనం పై ఉన్న వెంకటాయపాలెంకు చెందిన పవన్ గాయాలపాలయ్యారు. ప్రమాదంలో గాయపడిన వారిని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి తన వాహనంలో ఆసుపత్రికి పంపించారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం చాట్రాయి మండలం వెళుతున్న ఆయన ప్రమాద ఘటనను గమనించి తన వాహనంలో క్షతగాత్రులను ఆసుపత్రికి పంపి వైద్యసేవలు అందించాలని సూచించడంతో టీడీపీ కార్యకర్తలు వారిని ఆసుపత్రికి తరలించారు.

క్రైం కార్నర్

పండుగకు ఇంటికి వెళుతుండగా ప్రమాదం
భవన నిర్మాణ కార్మికుడి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 9 : తాపీ పనులకు వెళ్ళి తిరిగి తమ గ్రామానికి వెళ్ళే నిమిత్తం రోడ్డుపై నిలబడి ఉండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణా జిల్లా బాపుల పాడు మండలం బొమ్ములూరుకు చెందిన కుందేటి రవికుమార్ (45) తాపీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. కొన్నిరోజుల నుంచి ఏలూరులో తాపీ పనులు చేయడానికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. ఉగాది పండుగ సందర్భంగా తన కుటుంబం వద్దకు వెళ్ళే నిమిత్తం సోమవారం రాత్రి పొద్దుపోయిన తరువాత ఏలూరు సమీపంలో మెయిన్ బైపాస్ వంగూరు బ్రిడ్జి వద్దకు వెళ్ళి తన గ్రామం వైపు రోడ్డుపై నిలబడి ఉన్నాడు. అతనిని గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్ళిపోయింది. దీంతో అక్కడికకడే మృతి చెందాడు. హైవే పోలీసులకు సమాచారం అందడంతో వారు వెంటనే ఏలూరు త్రిటౌన్ పోలీసులకు తెలి పారు. త్రిటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుళ్ళు ఏసేబు, విజయరాజులు కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

సారా బట్టీలపై పోలీసుల దాడులు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 9: మండలంలోని ముద్దప్పగూడెంలో సారా తయారు చేస్తున్న కేంద్రాలపై మంగళవారం జిల్లా, డివిజన్ అధికారుల ఆదేశాల జీలుగుమిల్లి సీఐ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం ఎస్ఐ కె.వెంకన్న సిబ్బందితో దాడులు నిర్వహించారు. దాడుల్లో 60 లీటర్లు సారాను స్వాధీనం చేసుకుని 1200 లీటర్లు బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు. సారా తయారీకి ఉపయోగించే సామాగ్రి స్వాధీనం చేసకుని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

ఆకివీడు, ఏప్రిల్ 9: అమ్మమ్మ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తానని చెప్పి విద్యార్థినిని బైక్‌పై ఎక్కించుకొని దారి మళ్లించడంతో భయంతో అతడి నుంచి తప్పించుకుని పోలీసులకు చెప్పడంతో ఆకివీడు ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేశారు. విజయవాడకు చెందిన పెరుమాళ్ళపల్లి పవిత్ర బీకాం ఫైనలియర్ చదువుతోంది. ఉగాది సందర్భంగా రెండు రోజులు సెలవులు రావడంతో ఆకివీడు మండలం అప్పారావుపేటలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లేందుకు సోమవారం రాత్రి ఆకివీడు గుమ్ములూరు సెంటర్‌లో ఆటో కోసం ఎదురు చూస్తోంది. అప్పారావుపేటకు చెందిన రొయ్య వేణుగోపాల్ మీ అమ్మమ్మ ఇంటి దగ్గర దిగిపెడతానని చెప్పి మోటారు సైకిల్ ఎక్కించుకున్నాడు. అసభ్యకరంగా మాట్లాడుతూ దారి మళ్లించడంతో మోటారు సైకిల్‌పై నుంచి దూకి తప్పించుకుని బంధువులకు ఫోన్ చేయడంతో వారు వచ్చి తీసుకెళ్లారు. మంగళవారం పవిత్ర ఫిర్యాదు మేర ఎస్ఐ కేసు నమోదు చేశారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

ఆకివీడు/ కాళ్ళ ఏప్రిల్ 9:సిద్ధాపురం, కురుపాకలో కోడి పందాలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేసి పది మందిని అదుపులోకి తీసుకొని రూ.8,300 ,మూడు కో డిపుంజులు, మూడు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. సిద్ధాపురంలో ఐదుగురు వ్యక్తులు నుంచి రూ.4,500, కోడిపుంజు, కోడి కత్తి, కురుపాకలో ఐదుగురు వ్యక్తులు నుంచి రూ.3,800 , రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేశారు. కాళ్ళ మండలం కోపల్లెలో ఉగాది పండుగ పురస్కరించుకుని కోడిపందాలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. 14 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.78,900 నగదు, 8 కోడిపుంజులు, 10 కోడికత్తులు స్వాధీనపరుచుకున్నట్టు కాళ్ళ ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత



కుక్కునూరు, ఏప్రిల్ 9 : గోదావరి ఆవలిలో ఉన్న తూర్పు గోదావరి జిల్లాలోని పలు గ్రామాల నుంచి గోదారి దాటి కుక్కునూరు మండలం వైపు అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకు న్నారు. వేసవి కాలం కావడంతో గోదావరి నీటి మట్టం తగ్గిపోయింది. ఈ క్రమంలో గోదావరిని దాటి మంగళవారం సీతారామపురం గ్రామానికి దాదాపు 70కు పైగా పశు వులను తోలుకొచ్చారు. ఇది తెలిసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి పశువులను వెళ్లనివ్వకుండా అడ్డుకు న్నారు. ఎక్కడ నుంచి తీసుకువస్తున్నారనే సమాచారాన్ని పోలీసులు సేకరించి విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉండగా గత కొన్నినెలలుగా కుక్కునూరు మండలం వైపు నుంచి అక్రమంగా పశువుల రవాణా జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి.


వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

కిరాయికి ఆటో మాట్లాడుకుంటే దారిలో దాడిచేసి దోచేశారు

భీమవరం క్రైం, ఏప్రిల్ 9 : కిరాయికి ఆటో మాట్లాడుకుంటే ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లి దాడి చేసి సొత్తు అపహరించిన సంఘటన భీమవరం పట్టణంలో చోటు చేసుకుంది. భీమవరం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి వివరాలు వెల్లడించారు. భీమవరం గ్రామీణ మండలం తోకతిప్ప గ్రామానికి చెందిన పొన్నాల వీర్రాజు మూడేళ్లక్రితం ఉపాధి నిమిత్తం మస్కట్ వెళ్లారు. ఈనెల 2న హైద్రాబాద్ చేరుకుని భీమవరం చేరేసరికి రాత్రి 11 గంటలు అయింది. అంబేడ్కర్ కూడలిలో ఆటో కోసం చూస్తుండగా యలమంచిలి మండలం కాజ గ్రామానికి చెందిన చింతాడ జయరాజు, భీమవరంలోని మెంటేవారితోటకు చెందిన జల్లి సురేంద్ర వచ్చి రూ.500లకు తోకతిప్ప తీసుకు వెళ్లేందుకు కిరాయి మాట్లాడుకున్నారు. వీర్రాజును ఆటోలో ఎక్కించుకున్నారు. పెట్రోలు కొట్టించుకున్న తరువాత టిఫిన్ తిని వెళదామన్నారు. బైపాస్ రోడ్డులోని ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లి బీరు సీసాతో బాధితుడి తలపై కొట్టి గాయపరిచారు. అతని దగ్గర ఉన్న సంచి తీసుకుని ఆటోలోనే ఇద్దరూ పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై సీఐ అడబాల శ్రీను దర్యాప్తు చేశారు. నిందుతులను పట్టుకున్నారు. రూ.1200 నగదు, పాస్‌పోర్టు, సెల్‌ఫోన్, వాచీలు, రెండు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు వెంటనే ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్ఐ వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్ళు లెనిన్ ప్రసాద్, శ్రీనివాస్, కె.నాగేంద్ర, రామకృష్ణ, జోసెఫ్, భాస్కరరావును డీఎస్పీ అభినందించారు.


పూజలు చేస్తున్న తపనా చౌదరి దంపతులు

తపనా ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవలు

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 9: ప్రజల ఆశీర్వాదంతో రాబోయే రోజుల్లో తపనా ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని నిర్ణయించినట్లు తపనా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నా రు. తపనా ఫౌండేషన్ ప్రారంభించి 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. గారపాటి చౌదరి, రేణుక దంపతులు గోపూజ చేశారు. అనంతరం పంచాగ శ్రవణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. చౌదరి మాట్లాడుతూ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో ప్రజలు భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సినీ గేయరచయిత అనంత శ్రీరామ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్‌కిషోర్, కన్వీనర్ కృష్ణప్రసాద్, మాలతిరాణి, చైతన్య, రామకృష్ణ, వరప్రసాద్, దాన భాస్కర్ పాల్గొన్నారు.

అంజనీ పుత్రుడికి అభిషేకాలు, పూజలు



ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 9: నగరంలోని అంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. తమలపాకులు, సింధూరంతో అర్చనలు జరిపారు. హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. పాండురంగ థియేటర్ సెంటర్, కోటదిబ్బ వద్ద ఆలయాలవద్ద భక్తులకు నిర్వాహకులు అన్నదానాన్ని నిర్వహించారు. గులాబీతోట, నరసింహారావుపేట, పత్తేబాద, అగ్రహారం, పవర్‌పేట ప్రాంతాలలోని అంజనీపుత్రుని ఆలయాలు భక్తుల పూజాదికాలతో కళకళలాడాయి.

కుక్కునూరులో మహాలక్ష్మి అమ్మవారి సంబరాలు

కుక్కునూరు, ఏప్రిల్ 9: కుక్కునూరు గ్రామ దేవత మహాలక్ష్మి సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలను మేళతాళాలతో గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గ్రామం అంతా పాడిపంటలతో ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుతూ పూజలు చేశారు. ఈ క్రమంలో భక్తులు నృత్యాలు చేస్తూ ఆనందోత్సవంలో పాల్గొన్నారు. కుక్కునూరులోని శివాలయం, సాయిబాబా ఆలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ పూజారులు పంచాగ శ్రవణం నిర్వహించారు.

వైభవంగా ఏకాంబరేశ్వరుని కల్యాణ మహోత్సవం

కామవరపుకోట. ఏప్రిల్ 9. ఆడమిల్లి కంచి కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, భాజా భజంత్రాలు, వేద మంత్రోచ్ఛరణలు అశేష భక్తుల సమక్షంలో శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులకు నిర్వాహకులు అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవాలు ఈనెల 13 వరకు కొనసాగుతాయి.

ఓటు మన హక్కు - ఓటు మన బాధ్యత


ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం

టి.నరసాపురం, ఏప్రిల్ 9: ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని అవగాహన కల్పించారు. ఓటుతో దేశ భవిష్యత్తును నిర్ణయించుకోవాలని బంజారా బజరంగీ భేరి ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ నాయక్ అన్నారు. రాజ్యాంగం సార్వజనీన వయోజన ఓటు హక్కు కల్పించినప్పటికీ నేటికి 30 నుంచి 40 శాతం మంది ప్రజలు ఎన్నికల్లో భాగస్వామ్యం కావడం లేదన్నారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం అని మాజీ సర్పంచ్ జరభల పూర్ణయ్య నాయక్ అన్నారు. ప్రజాస్వామ్య రక్షణలో భాగంగా ఓటు మన హక్కు, ఓటు మన బాధ్యత అనే నినాదంతో ప్రజల్లో ఓటు హక్కు విలువపై అవగాహన కలిపించడం కోసం బంజారా బజరంగీ భేరి సంఘం, గ్రామాల కూడళ్లలో బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నామని సంఘ అధ్యక్షులు జరభల చందా నాయక్ అన్నారు. కార్యక్రమంలో ధరావత్ బంగారయ్య భూక్యా సత్యం తదితరులు పాల్గొన్నారు.

ధర్మాజీగూడెం రహదారిపై వాహనాల తనిఖీ

లింగపాలెం, ఏప్రిల్ 9: లింగపాలెం - ధర్మాజిగూడెం ప్రధాన రహదారిపై ఎన్నికల అధికారులు తనిఖీ చేపట్టారు. హార్టికల్చరల్ ఏడీ జె.శాంతి ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలు తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ రూ.50 వేలకు మించి నగదు, ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులు, మద్యం అక్రమ రవాణా చేయకూడదని సూచించారు. నగదు తీసుకువెళ్ళాలంటే సరైన పత్రాలు ఉంచుకోవాలని ఓటర్లను ప్రలోబాలకు గురిచేసే వస్తువులను తీసుకువెళితే వారిని అరెస్ట్‌చేసి వస్తువులను సీజ్ చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు హెడ్‌కానిస్టేబుల్ జయరాజు, కానిస్టేబుల్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, మైనార్టీ వర్గాలను కలుపుకోవడం లేదు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 9: బీసీ, ఎస్సీ, మైనార్టీ వర్గాలకు చెందిన తమను టీడీపీ మండల అధ్యక్షుడు లంకా సత్తిపండు కలుపుకోకుండా సమావేశాలను నిర్వహిస్తున్నారని బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కూరాకుల బుజ్జి, మండల అధ్యక్షుడు రేపూరి వెంకటేశ్వరరావు ఆరోపించారు. ద్వారకాతిరుమలలో మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడారు. పంగిడిగూడెంలో జరిగిన సమావేశానికి తమను మినహాయించారన్నారు. అదిష్ఠానం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తామన్నారు. కూనపాము రామారావు, చిలకా కొండలరావు, వీరిశెట్టి రామారావు, దొప్పసాని సిద్ధిరాజు, పాతపాటి నాగు, తదితరులు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావుకు సీపీఐ నేతల నివాళి


చంద్ర రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళి

కామవరపుకోట, ఏప్రిల్ 9: సీపీఐ దివంగత నేత చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. చంద్ర చిత్రపటానికి వక్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను సీపీఐ నాయకు లు టీవీఎస్.రాజు, కంకిపాటి బుచ్చిబాబు, మీనుగుల దుర్గారావు, రమణ, చలమాల శ్రీనివాసరావు, ఏమండ్ర స్వామిదాసు తదితరులు వివరించారు.

కోడి పందేలపై దాడి : నలుగురి అరెస్ట్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 9: ఏలూరు రూరల్ మండలం ప్రత్తికోళ్ళలంక శివారు పొలాల్లో మంగళవారం రాత్రి కొంతమంది కోడిపందేలు ఆడుతున్నట్లు ఏలూరు రూరల్ ఎస్ఐ కె రాజారెడ్డికి సమాచారం అందింది. సిబ్బందితో వెళ్ళి దాడి చేశారు. అక్కడ కోడిపందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. మరో వ్యక్తి పరారీ అయ్యాడు. నాలుగు కోడి పుంజులు, ఒక కోడి కత్తి, 5,600 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేగొండపల్లిలో ఆరుగురు..

పోలవరం, ఏప్రిల్ 9: చేగొండపల్లిలో కోడిపందేలపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. చేగొండపల్లి శివారున కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశామన్నారు. 2 కోడి పుంజులు, 2 కత్తులు, రూ.24,900 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అరెస్ట్ చేసిన ఆరుగురిని బుధవారం జంగారెడ్డిగూడెం కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

తిరుమలదేవి పేటలో ముగ్గురు..

టి.నరసాపురం, ఏప్రిల్ 9: కోడిపందేలపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు మంగళవారం తెలిపారు. మండలంలోని తిరుమల దేవిపేట శివారు సాలిగూడెంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారని సమాచారం అఅందడంతో సిబ్బందితో దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకొని 2 కోడిపుంజులు, 2 కోడి కత్తులు, రూ.3870 నగదు స్వాధీనం చేసుకున్నారు.

మెట్లగూడెంలో నలుగురు..

లింగపాలెం, ఏప్రిల్ 9: మండలంలో కోడిపందేలపై పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని మెట్టగొల్లగూడెంలో కోడిపందేలు వేస్తున్నట్లు సమాచారం అందటంతో పోలీసులు దాడులు చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.6వేలు నగదు, మోటారు సైకిల్, కోడిపుంజు, కోడికత్తి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.చెన్నారావు తెలిపారు.


రాట్నాలమ్మ ఆలయంలో పంచాంగ శ్రవణం


టి.నరసాపురం శివాలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ


కామవరపుకోట శ్రీపీఠంలో పూజలు


ఏలూరులో కళాకారులకు సత్కారం

ఉగాది ఉషస్సు

ఆలయాల్లో పూజలు
పంచాంగ శ్రవణం
షడ్రుచుల పచ్చడి పంపిణీ
కళాకారులకు సత్కారం

ఏలూరు సిటీ, ఏప్రిల్ 9: జిల్లాలో శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం చేశారు. గ్రామ దేవతల ఆలయాల్లో నైవేద్యాలు సమర్పించారు. గ్రామాల్లో రైతులు పంచాంగ శ్రవణం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. క్రోధి నామ సంవత్సరం రాశి ఫలాలు వివరిచారు. ఏడాది మంచి చెడులు, వర్షాలు, పంటలు, పరిశ్రమ అభివృద్ధి, శుభముహూర్తాలు పంచాంగకర్తలు వివరించారు.

● ఏలూరు కల్చరల్: ఉగాది పర్వదినాన్ని నగర ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి షడ్రుచుల ఉగాది పచ్చడి పిల్లలు, పెద్దలు పంచుకున్నారు. ఇంటిల్లపాది సుఖసంతోషాలతో ఉండాలని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, జీవితంలో ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో వేద పండితులు పంచాంగశ్రవణం నిర్వహించారు. నగరంలో ఆధ్యాత్మికశోభ వెల్లివిరిసింది. సాంస్కృతిక ప్రదర్శనతో సందడి చేశారు. రామకృష్ణాపురంలోని సాహిత్యమండలి ప్రాంగణంలో ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. సాంస్కృతిక, కళా రంగాల్లో సేవలందించిన వారికి ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాబొట్ల పురుషోత్తం ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. సంగీత దర్శకులు ఎస్‌పిఎస్ వాసు సంగీత కచేరితో కార్యక్రమం ప్రారంభమైంది. సాహిత్య కార్యక్రమానికి గరికపాటి కాళిదాసు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్రసాహిత్య అకాడమి చైర్మన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి మాట్లాడారు. పుల్లాబొట్ల శ్రీరామ్మూర్తి స్మారక సాహిత్య పురస్కారాన్ని కవి, రచయిత ఎన్‌వీఆర్.సత్యనారాయణమూర్తికి అందజేశారు. సాహిత్య, సంగీత, పౌరాణిక, సాంఘిక, నృత్యరంగంలో ప్రతిభ కనబరిచిన వారిని ఘనంగా సత్కరించారు. లంకా వెంకటేశ్వర్లు, వి.రేవతి రామ్‌కుమార్, ఎమ్మీ ఖాజావలీ,పెదపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: శ్రీక్రోధి నామ సంవత్సరం మిశ్రమ ఫలితాలను అందిస్తుందని రాట్నాలకుంట రాట్నాలమ్మ ఆలయ అర్చకుడు పావులూరి సత్యనారాయణశర్మ అన్నారు. ఉగాదిని పురస్కరించుకుని అమ్మవారి సన్నిధిలో మంగళవారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. సంవత్సరం మొత్తం మంచి చెడు సమ్మిళితంగా ఉంటుందన్నారు. ఆహార కొరత ఉండదని, పాడిపరిశ్రమ మెరుగ్గా ఉంటుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఎండ వేడిమి పెరుగుతుందన్నారు. క్రోధి నామ సంవత్సరంలో వివాదాలకు ఆస్కారం ఉందని, ఒకరికొకరు స్నేహ భావంతో మెలగాలని సూచించారు.

రాట్నాలమ్మ తిరునాళ్లు ఈ నెల 23 నుంచి 27 వరకు జరగనున్నాయని ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, కొఠారు రామచంద్రరావు మంగళవారం రాట వేశారు. ఉత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● దెందులూరు: రామదండు ఆధ్వర్యంలో మహిళలు 216 కలశాలతో ఏకరూప వస్త్రధారణతో ఆలయం నుంచి గౌడ వీధి గంగానమ్మ గుడి వరకు ఊరేగింపు నిర్వహించారు. గంగానమ్మకు జలాభిషేకం చేసి గ్రామంలోని 9 గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. ఉగాది వేడుకలు సందర్భంగా పంచాంగ శ్రవణం చేశారు. రామదండు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు

● టి.నరసాపురం: మండలంలోని టి.నరసాపురం, మల్లుకుంట, మక్కినవారిగూడెం, కేతవరం, వెలగపాడు తదితర గ్రామాల్లోని ఆలయాలలో భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు పంచాంగ శ్రవణాన్ని చదివి వినిపించారు.

● కామవరపుకోట: స్థానిక శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితా శ్రీపీఠంలో ఉగాది వేడుకలు, పంచాంగ శ్రవణం కార్యక్రమాలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు దుర్గబాబు, సత్యశ్రీనివాసాచార్యులు అభిషేకాలు, అర్చనలు, హోమాలు జరిపించారు. రాశుల వారిగా సంవత్సర ఫలితాలను వివరించారు.

● ఉంగుటూరు: క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉంగుటూరు గ్రామ దేవత చల్లాలమ్మ, భద్రకాళి అమ్మవారు, చేబ్రోలు సాయి గాయత్రి, కైకరం శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వరాలయం, గ్రామ దేవత కంబాలమ్మ, వెంకమ్మ పేరంటాలమ్మకు ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు చేశారు. కైకరం సుబ్రహ్మణ్యేశ్వరాలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు.


దెందులూరులో కలశాలతో మహిళల ఊరేగింపు

● పోలవరం: మండలంలో ఉగాది సందర్భంగా పోలవరం రామాలయం, జగన్నాథపేట వినాయకుడి గుడి వద్ద గణేశ్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాను థియేటర్ ఎదుట ఉగాది పచ్చడి, మజ్జిగ పంపిణీ చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి, అభయాంజనేయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

● కొయ్యలగూడెం: మండలంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉగాది పచ్చడి పంచారు.

● లింగపాలెం: మండలంలోని రంగాపురం, కోదండరామాలయంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. రంగాపురం రామాలయంలో పంచాంగ శ్రవణం చేశారు. క్రోధి నామ సంవత్సరం ప్రజలకు మంచి జరగాలని ఆలయాల్లో పూజలు చేశారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

● చింతలపూడి: గ్రామాల్లో ఉగాదివేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో పూజలు, పంచాంగ శ్రవణం చేశారు. విశ్వనాథ మఠం, వేగిలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గాంధీనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

● బుట్టాయగూడెం: ఉగాదిని పురష్కరించుకుని స్వామివారి, అమ్మవారి ఆలయాలు వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే దంపతులు తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ తమ క్యాంపు కార్యాలయాలు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి చిర్రి బాలరాజు బుట్టాయగూడెం శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంచులవారిగూడెం గుబ్బల మంగమ్మ జాతరలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలంతా అష్ట ఐశ్వర్య ఆయురారోగ్య సుఖఃసంతోషాలతో ఉండాలని వానకు మెండుగా కురవాలని పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు.


అప్పనవీడులో జయహో బీసీ కార్యక్రమంలో చింతమనేని


సమావేశంలో మాట్లాడుతున్న బడేటి చంటి


ద్వారకాతిరుమల మండలంలో మద్దిపాటి ప్రచారం


గణపవరంలో కూటమిలో చేరిన వారితో గన్ని, ధర్మరాజు

బీసీలకు అండగా టీడీపీ

● జయహో బీసీ సదస్సులో చింతమనేని ప్రభాకర్ ● పలు గ్రామాల్లో కూటమి అభ్యర్థుల ప్రచారం

పెదపాడు, ఏప్రిల్ 9 : బీసీలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, పార్టీకి బీసీలు వెన్నెముక అని ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అన్నారు. అప్పనవీడులో జయహో బీసీ కార్యక్రమం మంగళవారం జరిగింది. వైసీపీ ప్రభుత్వం బీసీలను అన్నివిధాలుగా మోసగించి వారి అభివృద్ధిని మరింత కుంటుపడేలా చేసిందని, వారి అభివృద్ధికి కేటాయించాల్సిన నిధులను పక్కదారి పట్టించడంతో పాటుగా వారిపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తీసుకున్న చర్యలు శూన్యమని చింతమనేని విమర్శించారు. అప్పులభారంతో అభివృద్ధి కుంటుపడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరిగి అభివృద్ధి దిశగా ముందుకెళ్లాలంటే చంద్రబాబు నాయకత్వంలో సుస్థిర ప్రభుత్వంతోనే సాధ్యమని ప్రభాకర్ తెలిపారు. వైసీపీ అవినీతి పాలనపై టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చేపట్టిన పోరాటానికి మీరంతా మద్దతుగా నిలవాల్సిన అవసరముందన్నారు. జనసేన నాయకురాలు ఘంటశాల వెంకటలక్ష్మి, పెద్దసంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు పథకాలతో టీడీపీ మినీ మేనిఫెస్టో

పెదవేగి: షడ్రుచుల సమ్మేళనం ఉగాది. ఆరు పథకాలతో టీడీపీ మేనిఫెస్టో. ఈ రెండింటి కలయిక రాష్ట్ర ప్రజలకు కొత్త ఏడాది సంతోషాలను తీసుకొస్తుందని చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలోని చింతమనేని స్వగృహంలో మంగళవారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ ఉగాది తెచ్చిన షడ్రుచులకు టీడీపీ అమలు చేయబోయే ఆరు పథకాలు తోడై ప్రజలకు సకల శుభాలను తీసుకొస్తుందన్నారు. మరో నెలరోజుల్లో రాష్ట్రంలో టీడీపీ కూటమి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, ఆరోజునుంచి రాష్ట్రంలో సంక్షేమ పాలన ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న వైసీపీ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా జరిగే ధర్మయుద్ధంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జానంపేట, న్యాయంపల్లి గ్రామాల నుంచి వైసీపీ నుంచి భారీసంఖ్యలో టీడీపీలో చేరారు. వారికి చింతమనేని ప్రభాకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి, సహకారాన్ని అందించాలని సూచించారు. జానంపేట వార్డు సభ్యురాలు యర్రా లింగమ్మ, ఆమె భర్త యర్రా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ కోసం ఎన్నో సేవలు చేస్తే పట్టించుకోవడం మానేశారన్నారు. ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలుపునకు తనవంతు సహకారాన్ని అందిస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, చల్లా ఏడుకొండలు, జయబాబు, దావులూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ భూదాహానికి చేనేత కుటుంబం బలి : బడేటి చంటి

ఏలూరు టూటౌన్: వైసీపీ నాయకుల భూదాహానికి చేనేత కుటుంబం బలైపోయిందని, దీనికి జగన్ బాధ్యత వహించాలని ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి అన్నారు. 43వ డివిజన్‌లో మంగళవారం ప్రజాగళం నిర్వహించారు. చంటి మాట్లాడుతూ రాష్ట్రాన్ని డ్రగ్ మాఫియాలాగా తయారు చేసి యువత భవిషత్ నాశనం చేస్తున్నారన్నారు. పాఠశాల స్థాయిలో కూడా గంజాయి, మత్తు పదార్థాలు అందుబాటులోకి తెచ్చి వైసీపీ ప్రభుత్వం దిగజార్చిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే వలంటీర్లకు రూ.10వేలు ఇస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. శివప్రసాద్, నాగిరెడ్డి, మల్లెపు రాము, సూర్యనారాయణ, దుర్గారావు పాల్గొన్నారు.

కూటమి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

చింతలపూడి: తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఉగాది వేడుకలు కూటమి ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పక్కాల వెంకటేశ్వరరావు పూజా సామగ్రి తీసుకురాగా పండితులు పూజలు నిర్వహించారు. రానున్నది తెలుగుదేశంప్రభుత్వమేనని రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వం ద్వారా మాత్రమే సాధ్యమని పలువురు నాయకులు అన్నారు. ప్రజలు కూటమి పాలన ఆశిస్తున్నారని, అది నెరవేరాలంటూ పూజలు చేశారు. క్రోధి నామ సంవత్సర ఫలాలు కూడా కూటమికి అనుకూలంగా ఉన్నాయని నాయకులు, కార్యకర్తలు చర్చించుకున్నారు. జె.ముత్తారెడ్డి, నాగభూషణం, కోండ్రు దేవా, అనిష్‌కుమార్, రాజు, చిట్లూరి ధర్మరాజు, రామారావు, జనసేన నాయకులు విజయ్‌కుమార్, భారతి, పలువురు పాల్గొన్నారు.

● కామవరపుకోట: వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని, చంద్రబాబు సీఎం అవుతారని వేద పండితులు చెప్పారని మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ రామకృష్ణ అన్నారు. గుంటుపల్లి, కంఠమనేనివారిగూడెం, కొల్లివారిగూడెం గ్రామాల్లో టీడీపీ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. గోరింకదాసు, కంఠమనేని పుష్పరాజ్యం, బేతిన వెంకట్రావు, మురళి, కంఠమనేని అంజిమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కూటమికి మద్దతుగా 300మంది చేరిక

గణపవరం: వైసీపీ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకొచ్చి అభివృద్ధి పథంలో నడిపించే సత్తా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గణపవరంలో సప్పా రాంబాబు ఆధ్వర్యంలో 300 మంది కూటమిలో చేరారు. అంతకు ముందు జల్లికాకినాడలో టీడీపీ అధ్యక్షుడు దండు బాబ్జీరాజు ఆధ్వర్యంలో 30 మంది జనసేనలో చేరారు. ఇందుకూరి రామకృష్ణంరాజు, కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, కాపారం చిన్న, యాళ్ళ సుబ్బారావు, అద్దేపల్లి వాసురాజు, దండు శ్రీహరిరాజు, పల్లి వెంకటేశ్వరరావు, దాసరి అప్పన్న, కనకరాజు సూరి, కూనిరెడ్డి సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై కూటమి పోరాటం

కొయ్యలగూడెం: ప్రజా సమస్యలపై కూటమి పోరాటం చేస్తుందని చిర్రి బాలరాజు అన్నారు. యర్రంపేట, గంగన్నగూడెం, తిమ్మన్నకుంట, కుంతలగూడెం, కనకాద్రిపురం గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లుగా గ్రామాలు అధ్వానంగా తయారయ్యాయన్నారు. రోడ్డు కూడా నిర్మించలేని పరిస్థితుల్లో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పూర్ణ, చెరుకూరి గోపాలరావు, దొమ్మేటి రమణ, దుగ్గిన శ్రీను, తోట రవి, కామిశెట్టి సత్తిబాబు, సిద్దా నాయుడు, రేపల్లి తేజ, కొయ్యల బాలకృష్ణ పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల, ఏప్రిల్ 9: పంగిడిగూడెంలో టీడీపీ మండల అధ్యక్షుడు లంకా సత్యన్నారాయణ అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో గోపాలపురం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్నికల్లో విజయానికి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశం అనంతరం ఆయన ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు.

● చింతలపూడి: ఊటసముద్రంలో కూటమి టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు కొమరరాజు సత్యనారాయణ, అంకమరావు ఆధ్వర్యంలో అయనకు స్వాగతం పలికారు. కండ్రిగూడెంలో చలివేంద్రం ప్రారంభించి అల్లిపల్లిలోని చర్చిలో ఫాదర్ ఆశీసులు తీసుకున్నారు. బీసీకాలనీ, ఎస్సీకాలనీ అల్లిపెల్లిలో ఊటసముద్రంలో ఆయన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబువల్లే సాధ్యమన్నారు. అప్పిరెడ్డినాగు, నరసారెడ్డి, ప్రసాద్, నాంచారయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ పంపుసెట్లు రైతులకు ఉరితాళ్లు

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 9: వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపు రైతులకు ఉరితాళ్ళని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్ అన్నారు. రైతులంతా మీటర్ల బిగింపు ప్రతిఘటించాలన్నారు. అన్నేభవన్‌లో రైతు సంఘం సమావేశం జరిగింది. శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రం విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. జీఓ 22 రద్దుచేసి మీటర్ల బిగింపు ఆపాలన్నారు. ఉచిత విద్యుత్‌కు మంగళం పాడేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతుందన్నారు. కార్యక్రమంలో రాంబాబు, పాల్గొన్నారు.

జూట్‌మిల్లు మూసివేతతో కార్మికులకు అన్యాయం

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 9: జూట్‌మిల్లు మూసివేతతో కార్మికులకు తీరని అన్యాయం చేశారని జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే అన్నారు. జూట్‌మిల్లులో పనిచేసే 3వేల మంది కార్మికుల కుటుంబాలు రోడ్డునపడ్డాయన్నారు. తక్షణమే జూట్‌మిల్లు కార్మికులకు న్యాయం చేయాలన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 9 : రోజు రోజుకు పెరుగుతున్న ఎండలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి అన్నారు. ఏలూరు ఎన్ఆర్‌పేటలోని ఓవర్ బ్రిడ్జి పక్కన రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి సౌజన్యంతో గత నెలలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో తన మనుమడు గుర్రాల అఖిల్‌రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని 31వ రోజు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బివి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇండ్ల నుంచి బయటకు వచ్చేటప్పుడు తరచుగా మంచినీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్ళు వంటివి తీసుకోవడం వల్ల వడదెబ్బనుంచి కాపాడుకోవచ్చన్నారు. ఈ మజ్జిగను కృష్ణారెడ్డి, ఆయన సతీమణి పద్మజా వాణి పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

టి.నరసాపురం, ఏప్రిల్ 9: రాజుపోతేపల్లి సబ్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ పి.రాధాకృష్ణ కోరారు.

అభయాంజనేయుడి ఆలయం వద్ద అన్న సమారాధన

పెదపాడు, ఏప్రిల్ 9: అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దాతల సహకారం తో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 200 మంది అన్నదానం స్వీకరించినట్లు ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పెద్దసంఖ్య లో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ముస్లిం పెద్దలు

పేద ముస్లింలకు దుస్తుల పంపిణీ

చింతలపూడి, ఏప్రిల్ 9: రంజాన్‌ను పురస్కరించుకుని 200 మంది పేద ముస్లింలకు రూ.80వేలు విలువచేసే దుస్తులు స్థానిక మసీదు వద్ద మంగళవారం పంపిణీ చేశారు. ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ఏటా ముస్లింల నుంచి వసూలుచేసిన ఫిత్రాదానం సొమ్ముతో పేదలకు దుస్తులు, సరుకులు పంపిణీ చేస్తామన్నారు. 50 ఏళ్లుగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జమాతే ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే హుస్సేన్, మసీదు కమిటీ అధ్యక్షులు ఎస్‌డీ.బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిలానీ, రజాక్, కిజర్ భాష, ఇస్సాకు, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో జామాయిల్ తోట దగ్ధం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 9: అగ్నిప్రమాదంలో జామాయిల్ తోట దగ్ధమైన ఘటన నూజివీడు మండలం దిగవల్లిలో చోటుచేసుకుంది. దిగవల్లికి చెందిన బత్తుల సత్యవేదం, కోపూరి చిట్టెమ్మలకు చెందిన సుమారు 7 ఎకరాల జామాయిల్ తోట దగ్ధమైంది. తోటలో మంటలు ఎగిసి పడటాన్ని చూసిన పరిసర ప్రాంత రైతులు వాటిని ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. దాదాపు రూ.7 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు.

వేధింపుల యువకుడిపై కేసు నమోదు

ముసునూరు, ఏప్రిల్ 9: యువతిని ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై ఎస్ఐ పి.వాసు మంగళవారం కేసు నమోదు చేశారు. కాట్రేనిపాడుకు చెందిన యువతిని ముసునూరు ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చిత్రకళ వ్యాప్తికి అంకాల అకాడమి కృషి భేష్

భీమవరం టౌన్, ఏప్రిల్ 9: ఆధునిక సాంకేతికత, డిజిటల్ మార్పు ప్రభావంతో సాంప్రదాయ కళలు మరుగునపడే పరిస్థితి ఏర్పడిందని, ఈ నేపథ్యంలో చిత్రకళ వ్యాప్తికి అంకాల ఆర్ట్ అకాడమి చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఉప వాణిజ్య పన్నుల అధికారిణి ఎం.శేషుకుమారి అన్నారు. అకాడమి ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. మంగళవారం చిత్రకారులు కట్టిబోయిన శ్రీనివాస్, పరిమి రామకృష్ణ, గ్రంథి నరసింహమూర్తి సత్కార సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ ముగ్గురు చిత్రకారులు విద్యార్థులకు చిత్రకళలో మెళకువలు నేర్పుతూ తీర్చిదిద్దుతున్నారని అకాడమి అధ్యక్షుడు గ్రంథి వెంకట్రావు అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కాగిత వెంకటరమణ, కోశాధికారి గోపా సత్యనారాయణ, సహాయ కార్యదర్శి భాను, రాజశేఖర్ పాల్గొన్నారు.


కోడిగూడెం గ్రామంలో ఎగురుతున్న వైసీపీ జెండాలు

కోడ్ కూసినా పట్టించుకోరే..

కోడిగూడెం వీధుల్లో అధికార పార్టీ జెండాలు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 9: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి చాలా రోజులైనా ఇంకా పలుచోట్ల వైసీపీ జెండాలు ఎగురుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోక పోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని కోడిగూడెంలో అధికార పార్టీ జెండాలు ఎగురుతున్నా గ్రామ కార్యదర్శి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.


పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువు

3 రోజులకోసారి కుళాయి..

కలిదిండి, ఏప్రిల్ 9 : జిల్లాకు శివారు గ్రామాలైన పెదలంక, మూల్లంక, భాస్కరరావుపేట గ్రామాల్లో తాగునీటి చెరువులు అడుగంటాయి. ప్రస్తుతం మూడు రోజులకొకసారి కుళాయిలను వదులుతున్నారు. ఫిల్టర్ చేయకుండా నేరుగా బురద నీటిని వదులుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయా గ్రామాల్లో తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలంటే సీబీ కెనాల్‌కు కనీసం 400 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉండగా సోమవారం కేవలం 270 క్యూసెక్కులు మాత్రమే విడుదల కావటంతో అవి ఏ మూలకూ రాలేదు. వారం రోజులపాటు నిరంతరాయంగా తాగునీటి వంతు సరఫరా చేయాలని సర్పంచ్‌లు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితిలో సీబీ కెనాల్‌కు సమృద్ధిగా తాగునీరు విడుదల చేసే పరిస్థితి కన్పించటం లేదని ఆందోళన చెందు తున్నారు. ఫిబ్రవరిలో పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువు వద్దకు తాగునీటి వంతు చేరకపోవటంతో ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పొలు పేట వద్ద కాల్వలో మోటార్ పంపు సెట్‌లతో నీరు తోడినప్పటికీ పెదలంక తాగునీటి వద్దకు చేరలేదు. దీంతో తాగునీటి కొరత ఏర్పడింది. ఉమ్మడి కృష్ణా జిల్లాకు శివారు పశ్చిమ గోదావరి సరిహద్దున ఉప్పుటేరు పక్కన ఉన్న పెదలంకలో 8 ఎకరాల విస్తీర్ణం కలిగిన తాగునీటి చెరువు పూర్తిగా అడుగం టింది. ఈ సారి తాగునీటి వంతు చెరువు వద్దకు చేరితేనే చెరువును నింప టానికి అవకాశం ఉంటుందని, పెదలంక తాగునీటి చెరువును నింపటానికి అధికారులు ప్రాధాన్యమివ్వాలని సర్పంచ్ లక్ష్మీ, గ్రామస్థులు కోరుతున్నారు.


చంద్రప్రభ వాహనంపై శోభనాచలుడు


సింగరాయపాలెం ఆలయంలో పంచాంగ శ్రవణం


పెద్దింటి అమ్మవారి చరిత్ర గ్రంథావిష్కరణ

భక్తిశ్రద్ధలతో ఉగాది

ఉగాదిని తెలుగువారంతా సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. లోగిళ్లను మామిడి తోరణాలతో అలంకరించి రంగవల్లులు తీర్చిదిద్దారు. ఆలయాలకు వెళ్ళి పూజలు చేశారు. ఉగాది పచ్చడిని స్వీకరించారు.

ముసునూరు: ముసునూరు వేంకటాచల స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం లక్ష్మీనరసింహాచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో పంటలు సమృద్ధిగా పండుతాయని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, కష్టపడితే రాజకీయ నాయకులకు విజయం వరిస్తుందన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి శ్రీ శోభనాచల లక్ష్మీనరసింహ స్వామిని చంద్రప్రభ వాహనంపై ఊరేగింపుగా తీసుకువచ్చి స్థానిక దమ్మన్న మండపం వద్ద ప్రధాన అర్చకులు వేదాంతం శేషబాబు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం చేశారు. ఆగిరిపల్లిలో విరూపా టౌన్‌షిప్‌లో గల బాబా మందిరంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం విజయవాడ వాస్తవ్యులు కొల్లిపర వీరభద్రరావు దంపతులు భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

కైకలూరు: శ్రీ శ్యామలాంబ ఆలయంలో నూరి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది. కైకలూరు శాఖా గ్రంథాలయంలో సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో ఉగాది మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జ్ఞానరత్న డాక్టర్ ఉంద్రమట్ల సాంబశివరావు పాల్గొని ఉగాది విశిష్టతను తెలియజేశారు. అనంతరం సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారి చరిత్ర గ్రంథావిష్కరణ జరిగింది. సాహితీమిత్రుల అధ్యక్షులు తుమ్మలపల్లి బాలకృష్ణరావు, ప్రధాన కార్యదర్శి చింతపల్లి వెంకట నారాయణ, రామకృష్ణసేవా సమితి సభ్యులు రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలోని రామాలయం, భక్తాంజనేయ స్వామి ఆలయాల్లో అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు పూజలు, భజనలు చేశారు.

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం, చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసియున్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం జరిగింది. స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. చావలి సూర్యనారాయణ మూర్తిని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నేల సంధ్య సన్మానించి రూ. 10,116 చెక్కును అందజేశారు. అర్చకులు వేద పండితులను సన్మానించారు. అనంతరం ఆలయం ఎదుట చలివేంద్రం ఏర్పాటు చేశారు.

కలిదిండి: కలిదిండిలోని పాతాళ భోగేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. వేదపండితులను ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు సత్కరించారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో ఆధ్యాత్మిక మహా మండలి ఆధ్వర్యంలో ఉగాది మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అగ్నిహోత్రం మురళీకృష్ణమాచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. ప్రముఖ కర్నాటక సంగీత విద్వాంసురాలు శ్రీమతి గీతాంజలి కీర్తనలు ఆలపించారు.


పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

నేత్రపర్వం..శ్రీవారికి ఉగాది ఉత్సవం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 9: ద్వారకాతిరుమలేశుని క్షేత్రంలో స్వామివారికి ఉగాది ఉత్సవం మంగళవారం రాత్రి రమణీయంగా జరిగింది. గరుడాళ్వార్ కూడలిలో ఉన్న ఉగాది మండపంలో ఆలయ అర్చకులు వేడుక నిర్వహించారు. ముందుగా సాయంత్రం ఆలయంలో ఉభయదేవేరులు, గోదాదేవితో కలసిన శ్రీవారి మూర్తులను వెండి శేషవాహనంపై ఉంచి అర్చకులు ప్రత్యేక అలంకారం చేశారు. మేళతాళాలు, సన్నాయివాయిద్యాలు వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా శ్రీవారు కొలువుదీరిన వాహనం ఉగాది మండపం వద్దకు చేరింది. స్వామి, అమ్మవార్లకు భక్తులు నీరాజనాలు సమర్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఏర్పాటు చేసిన రజిత సింహాసనంపై శ్రీవారి మూర్తులను ఉంచి అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు, పండితులు పంచాంగ శ్రవణం చేశారు ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో ఈఓ త్రినాథరావు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కైకలూరులో ఎన్డీయే కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి సిద్ధార్థ్‌నాథ్ సింగ్, కామినేని, పుట్టా మహేష్


చీపురుగూడెంలో కూటమి అభ్యర్థి సారథి ఎన్నికల ప్రచారం


ఆలపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కైకలూరు కూటమి అసెంబ్లీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్


కొరగుంటపాలెంలో టీడీపీ నాయకుల ప్రచారం

స్టీల్ ప్లాంట్‌పై ఓటు బ్యాంక్ రాజకీయాలు

▸▸ప్రైవేటీకరణకు ఆమోదం తెలపలేదు ▸▸ఎన్డీయే గెలిస్తే జగన్ జైలుకే ▸▸బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి సిద్ధార్థ్‌నాథ్ సింగ్

కైకలూరు, ఏప్రిల్ 9: కైకలూరు బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను ప్రజలు గెలిపిస్తే ఆయనకు మంత్రి పదవి ఇచ్చే బాధ్యత తనదని దివంగత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి మనవడు, రాష్ట్ర బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి లాల్ సిద్ధార్థ్‌నాథ్ సింగ్ అన్నారు. మంగళవారం కైకలూరు -గుడివాడ రోడ్డులో కూటమి కార్యాలయాన్ని కైకలూరు అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్‌తో కలసి ఆయన ప్రారంభించి మాట్లాడుతూ కామినేనిని, మహేష్‌ను గెలిపించి పంపించవలసిన బాధ్యత కైకలూరు ప్రజలదేనన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సమస్యను ఓటు బ్యాంకుగా వాడుతున్నారని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్రం ఆమోదం తెలపలేదన్నారు. రాజధానిని జగన్ మూడు ముక్కలు చేశారని ఎన్డీయే కూట మి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి ఏకైక రాజధాని అమరావతి ఉంటుందని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో జగన్ విఫలమ య్యారని కూటమి గెలుపుతో రానున్న ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి రైతుపక్షపాతిగా కూటమి ఉంటుందన్నారు. కూటమి అధికారంలోకి వస్తే జగన్‌రెడ్డి జైలుకు వెళ్తారని ఆయన అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తా మన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న తన తాత లాల్ బహదూర్ శాస్త్రిని జైల్లో ఉంచారని ఆ సమయంలో తన కుటుంబ సభ్యులకు తిండి లేక బతకడం చాలా కష్టమయ్యేదన్నారు. మోదీ నాయకత్వంలో దేశం శక్తివంతంగా తయారైందన్నారు. కామినేని మాట్లాడుతూ కూటమి ఏర్పాటులో పవన్‌కల్యాణ్ పాత్ర కీలకమని, తనను, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌ను గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి మహేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్రబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, బీజేపీ నాయకులు మధుకర్‌జీ, లంకా దినకర్, చిగురుపాటి కుమారస్వామి, కురేళ్ళ సుధాకర్ కృష్ణ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కూటమితోనే బంగారు భవిత : పార్థసారథి

చాట్రాయి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలిస్తేనే భావితరాలకు బంగారు భవిష్యత్తు వస్తుందని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని చీపురుగూడెం, కోటపాడు గ్రామాల్లో మంగళవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ వైసీపీ 5 ఏళ్ళ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, ప్రజలు కూటమిని అధికారంలోని తెచ్చుకుంటేనే నవ్యాంధ్రకు పూర్వవైభవం వస్తుందన్నారు. సీఎం జగన్ ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధించారని, ఈ రాక్షసపాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి మెట్టలో సాగు, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని, తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతులు చేయిస్తానని అన్నారు. చంద్రబాబు సీఎం కాగానే ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేలు, నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు, స్కూలుకు వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15 వేలు, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, ప్రతి స్త్రీకి నెలకు రూ. 1500, ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని వివరించారు. మర్రిబంధం వద్ద మూడు పార్టీల శ్రేణులు పార్థసారథికి ఘన స్వాగతం పలికారు. అనంతరం భారీ బైక్ ర్యాలీ జరిగింది. టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, నాయకులు అట్లూరి రమేష్, బొట్టు రామచంద్రరావు, మందలపు ప్రసాదరావు, బొట్టు లక్ష్మణరావు, జగదీష్, మంచిన పూర్ణ, బొంతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి రంగాన్ని దెబ్బతీసిన వైసీపీ

నూజివీడు: మేకిన్ ఇండియా పేరుతో ఉపాధి రంగంలో దేశం ముందడుగు వేస్తోంటే రాష్ట్రంలో పరిశ్రమలు తిరోగమనంలో ఉండి యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోవడానికి వైసీపీ ప్రభుత్వమే కారణమని నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు పట్టణంలో బీజేపీ నాయకులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే సత్తాలేక జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత ఆరోపణలతో ప్రతిపక్షాల నోరు మూయిస్తున్నారన్నారు. నూజివీడులో చిన్న నాయన అరాచకాలు, జగన్‌మోహన్‌రెడ్డి అరాచకాలను దాటిపోయాయన్నారు. స్థానికంగా ముద్దరబోయిన రెండుసార్లు ఓడిపోవడంతో 3వ సారి గెలుపు గుర్రాలవేటకు అన్ని పార్టీలు ప్రయత్నించాయని, ఇందులో భాగంగానే తాను నూజివీడు అభ్యర్థిగా పోటీలోకి దిగానన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్ చార్జ్ రంగారావు, మహిళా మోర్చా నాయకురాలు శివరాజు వసుంధరాదేవి, పట్టణ అధ్యక్షులు బోసు అప్పారావు, టీడీపీ నియోజకవర్గ నాయకులు నూతక్కి వేణు గోపాలరావు, లింగమనేని కిషోర్, అక్కినేని చందు తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయంతోనే గ్రామాల్లో సౌకర్యాలు

ముదినేపల్లి: గ్రామాల్లో అన్ని సౌకర్యాలు మెరుగుపడాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ అన్నారు. ముదినేపల్లి మండలం కొరగుంటపాలెం, విశ్వనాద్రిపాలెం గ్రామాల్లో ఆయన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు సాగి రాజు సూర్యనారాయణ రాజు, బత్తుల రవి, నాయుడు సీతారామయ్య, పంతగాని సురేష్, జనసేన నాయకులు హనుమ, బాసినశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు. విశ్వనాద్రిపాలెంలో పలువురు యువకులు వినోద్ సమక్షంలో టీడీపీలో చేరారు. కాకరవాడలో టీడీపీ నాయకులు కొత్తూరు విఠల్, మారగాని నాగేశ్వరరావు, మరీదు అర్జునరావు తదితరులు ప్రచారం చేశారు.

ఆక్వా అభివృద్ధికి వైసీపీ మంగళం : కామినేని

కైకలూరు: ఆక్వా పరిశ్రమ అభివృద్ధిని తుంగలో తొక్కి రైతుల జీవితాలతో వైసీపీ చెలగాటమాడుతోందని కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆలపాడులో విఘ్నేశ్వరుడి ఆలయంలో పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలో ప్రచార రథంపై వెళుతూ ప్రజలను ఓట్లను అభ్యర్థించారు. అనంతరం పల్లెవాడ ప్రచారంలో ఆయన మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గం ఆక్వాకు ప్రసిద్ధి అని ఈ ప్రాంతాన్ని జగన్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించి ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసి రైతులను కోలుకోలేని దెబ్బతీసిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, మాజీ జడ్పీటీసీ విజయలక్ష్మీ, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, మాజీ సర్పంచ్ పటాకుల సుబ్బారావు, బీజేపీ నాయకుడు సీఎల్ వెంకట్రావు, మూడు పార్టీల కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అలాగే తామరకొల్లు, రాచపట్నం, చింతలచెరువు గ్రామాల్లో నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున ప్రచారాన్ని నిర్వహించారు. ఎంపీటీసీ వెంకటనరసమ్మ, నాయకులు ఎలిషా, యలవర్తి శివాజీ, వాసిపల్లి సతీష్‌కన్నా, భట్రాజు రాజేష్, మాడెం కృష్ణారావు, జక్కుల విజయకుమార్, అందుగుల పెద్దదానియేలు, గంగుల శ్రీదేవి, బూరుబోయిన శ్రీనివాసరావు, గంగుల ఏసురాజు, గంగుల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

పోతుమర్రులో కూటమి ప్రచారం

కలిదిండి: పోతుమర్రులో మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో అందజేసి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, కూటమి నాయకులు నంబూరి భీమరాజు, పామర్తి సత్యనారాయణ, కర్రేటి శ్రీహరి, గోళ్ల శ్రీనివాసరావు, మన్నె సత్యనారాయణ, కట్టా నాని, పడమటి సూరిబాబు, నున్న సుబ్రహ్మణ్యం, గొరిపర్తి బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి మండలంలో...

మండవల్లి: కొర్లపాడు, గన్నవరం, మొకాసా కలవపూడి గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. వైసీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పేదల భూములను కాజేసేందుకు దొడ్డిదారిన జీవోలు తీసుకొచ్చిందన్నారు. మూడు పార్టీల నాయకులు సజ్జ బాబి, సమయం ఏసుబాబు, కూనపురెడ్డి కోటేశ్వరరావు, కూనపురెడ్డి శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, గులాబి మోహన్, తోట ఆంజనేయులు, గాది రాజయ్య, వరద సురేష్, పులి రంగా, వడ్ల రాంబాబు, అప్పారావు, నల్లశ్రీను, రెడ్డి, జనార్దన పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటో, బైక్ ఢీ ఇద్దరికి గాయాలు

క్షతగాత్రులను తన వాహనంలో ఆస్పత్రికి తరలించిన కొలుసు


రోడ్డుపై పల్టీ కొట్టిన ఆటో

నూజివీడు టౌన్, ఏప్రిల్ 9: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. నూజివీడు మండలం అన్నవరం గ్రామంలో నూజివీడు నుంచి విస్సన్నపేట వైపు వస్తున్న ఆటో వెంకటాయపాలెం నుంచి వస్తున్న బైక్ ఢీకొన్నాయి. దీంతో ఆటో పల్టీకొట్టడంతో ఆటోలో ఉన్న డ్రైవర్ బాపులపాడు మండలం కొత్తపల్లికి చెందిన కృష్ణతో పాటు ద్విచక్రవాహనంపై ఉన్న వెంకటా యపాలెంకు చెందిన పవన్ గాయాలపాలయ్యారు. ప్రమాదంలో గాయపడిన వారిని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి తన వాహనంలో ఆసుపత్రికి పంపించారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం చాట్రాయి మండలం వెళు తున్న ఆయన ప్రమాద ఘటనను గమనించి తన వాహనంలో క్షతగాత్రులను ఆసుపత్రికి పంపి వైద్యసేవలు అందించాలని సూచించడంతో టీడీపీ కార్యకర్తలు వారిని ఆసుపత్రికి తరలించారు.

జామాయిల్ తోట దగ్ధం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 9: అగ్నిప్రమాదంలో జామాయిల్ తోట దగ్ధమైన ఘటన నూజివీడు మండలం దిగవల్లిలో చోటుచేసుకుంది. దిగవల్లికి చెందిన బత్తుల సత్యవేదం, కోపూరి చిట్టెమ్మలకు చెందిన సుమారు 7 ఎకరాల జామాయిల్ తోట దగ్ధమైంది. తోటలో మంటలు ఎగిసి పడటాన్ని చూసిన పరిసర ప్రాంత రైతులు వాటిని ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. దాదాపు రూ.7 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధిత రైతులు వాపోతున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు, ఏప్రిల్ 9: మండలంలోని గోపవరంలో పేకాట శిబిరంపై మంగళవారం ముసునూరు పోలీసులు దాడి చేశారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 1200 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.వాసు తెలిపారు.

వేధింపుల యువకుడిపై కేసు నమోదు

ముసునూరు, ఏప్రిల్ 9: యువతిని ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై ఎస్ఐ పి.వాసు మంగళవారం కేసు నమోదు చేశారు. కాట్రేనిపాడుకు చెందిన యువతిని ముసునూరు ఎస్సీ కాలనీకి చెందిన రత్నకుమార్ అనే యువకుడు ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోడి పందేలపై దాడి

కలిదిండి, ఏప్రిల్ 9 : ఆవకూరు, పడమటిపాలెం గ్రామాల్లో మంగళవారం పోలీసులు కోడిపందేల శిబిరాలపై దాడి చేశారు. ఆవకూరులో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని రూ.7,100 నగదు, పుంజు, రెండు కత్తులు, పడమటిపాలెంలో 9 మంది జూదరులను అదుపులోకి తీసుకుని రూ.4300 నగదు, మూడు పుంజులు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు.


ఎన్డీయే కూటమిలో చేరిన కార్యకర్తలతో కామినేని

కూటమిలో చేరికలు

కైకలూరు, ఏప్రిల్ 9: కైకలూరు నియోజకవర్గంలో వైసీపీ నుంచి వందలాది మంది కూటమిలో చేరడం అభినందనీయమని కైకలూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కైకలూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో వైసీపీ కార్యకర్తలు పెద్దఎత్తున కామినేని, పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో కూటమి తీర్థం పుచ్చుకున్నారు. మండవల్లి మండల వైస్ ఎంపీపీ చాట్రగడ్డ నాగరాణి, భర్త స్వర్ణసింగ్ ఆధ్వర్యంలో 50 మంది, ముదినేపల్లి మండలం సింగరాయపాలెం నుంచి 150 మంది, కలిదిండి మండలం సానారుద్రవరం నుంచి 50 మంది, ఇందిరా కాలనీ నుంచి 150 మంది, పడమటిపాలెం నుంచి 20 మంది, పేట కలిదిండికి చెందిన 100 మంది, కైకలూరు మండలం దానగూడెం నుంచి 50 మంది, మండవల్లి మండలం కొర్లపాడు గ్రామం నుంచి 50 మంది మొత్తం 800 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ, జనసేన, బీజేపీలలో చేరారు. ఈ సందర్భంగా కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఇంతమంది కార్యకర్తలు తమ పార్టీలో చేరడం అభినందనీయమని ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్రబాబు, తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు, పార్టీల మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కొలుసు సమక్షంలో..


వలసపల్లిలో కొలుసు పార్థసారథి సమక్షంలో..

ముసునూరు: వలసపల్లి గ్రామానికి చెందిన 20 వైసీపీ కుటుం బాలు నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి సమక్షంలో మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు మేదరమెట్ల సురేంద్ర ఆధ్వర్యంలో సర్పంచ్ చలసాని దామోదరరావు తనయుడు ఉదయ్‌భాస్కర్, వేంపాటి గోవర్ధన్, దేవినేని శ్రీధర్, కాజా సీతారామయ్య, పాటిబండ్ల శ్రీరామమూర్తి, కూరపాటి నాగేశ్వరరావు, కాట్రు నాగేశ్వరరావు, పి. శ్రీనివాసరావుతోపాటు మరో 12 కుటుంబాల వారికి పార్థసారథి పసుపు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ పాలన అధ్వానంగా ఉందని, చంద్రబాబు సీఎం అయితే తప్ప రాష్ట్రానికి భవిష్యత్ ఉండదనే ఉద్దేశంతో టీడీపీలో చేరినట్టు వైసీపీ నాయకులు తెలిపారు. నూజివీడులో టీడీపీ జెండాను ఎగురవేసేలా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కృషి చేయాలని పార్థసారథి కోరారు.

ఎస్సీ, ఎస్టీల ద్రోహి జగన్ : పాలేటి



కైకలూరు, ఏప్రిల్ 9: జగన్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వర్గాలకు తీరని ద్రోహం చేసిందని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి మహేశ్వరరావు అన్నారు. మంగళవారం కైకలూరులో విలేకరులతో మాట్లాడుతూ జగన్ 27 దళిత పథకాలను ఒక్క జీవోతో రద్దు చేశాడన్నారు. అంబేద్కర్ విదేశీ విద్యను తీసివేసి వందలాది మంది ఎస్సీ, ఎస్టీ యువతకు ద్రోహం చేశారన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని దూరం చేసి 60 వేల మంది దళిత వర్గాల విద్యార్థులను కార్పొరేట్ కళాశాలల్లో చదవకుండా చేశాడన్నారు. దళితుల పేర్లు చెప్పి ఓట్లు దండుకుని ఎస్సీ, ఎస్టీ భూములను లాక్కొని వాటిలో పార్టీ కార్యాలయాలు, జగనన్న కాలనీలు నిర్మించారని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా జగన్‌రెడ్డి మోసాలను ప్రచారం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



ముద్దరబోయినకు మద్దతు

నూజివీడు, ఏప్రిల్ 9: నూజివీడు నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు తమ మద్దతు అని ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు కొండా మంగయ్య నియోజకవర్గ టీడీపీ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి జె.రాంబాబు, ఆగిరిపల్లి మండల టీడీపీ ఉపాధ్యక్షుడు జి.రంగారావు తదితరులు మంగళవారం నూజివీడు ముద్దరబోయిన కార్యాలయంలో ముద్దరబోయినను కలిసి తమ మద్దతు తెలిపారు. కొండా మంగయ్య విలేఖర్లతో మాట్లాడుతూ తాము సుదీర్ఘకాలం నుంచి తెలుగుదేశంపార్టీలో పనిచేశామని, గత పదేళ్ళుగా టీడీపీ ఇన్‌చార్జ్ ముద్దరబోయిన తమకు అండదండలుగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ ఓటును ముద్దరబోయినకు, పార్లమెంట్ ఓటును తెలుగుదేశంపార్టీకి వేయటానికి నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. తమ ప్రాణం పోయేవరకు తెలుగుదేశంపార్టీని వీడమని వీరు స్పష్టం చేశారు.

ముసునూరు మండలంలో ప్రచారం

ముసునూరు, ఏప్రిల్ 9: మండలంలోని చెక్కపల్లి, లోపూడి, గుళ్ళపూడి, వలసపల్లి గ్రామాల్లో మంగళవారం మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యకర్తల అభీష్టం మేరకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. మండలంలో అసైన్డ్ పట్టాలను రెగ్యులర్ చేయడంతోపాటు గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని అరికట్టేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ముదినేపల్లి మండలంలో నేడు కామినేని ప్రచారం

ముదినేపల్లి, ఏప్రిల్ 9 : కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ బుధవారం ముదినేపల్లి మండలంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నారు. బుధవారం ఉదయం బొమ్మినంపాడు, ములకలపల్లి, అల్లూరు గ్రామాల్లో ప్రచారం అనంతరం పెదగొన్నూరు, విశ్వనాద్రిపాలెం, ఉప్పరగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారు.

చలివేంద్రం ప్రారంభం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 9: రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్ ఆధ్వర్యంలో నూజివీడు బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. సీనియర్ రొటేరియన్ మూల్పూరి లక్ష్మణస్వామి, ఆర్టీసీ డిపో మేనేజరు పవన్‌కుమార్ చలివేంద్రాన్ని ప్రారంభించగా క్లబ్ అధ్యక్షుడు గొల్లపూడి రవిబాబు, సెక్రటరి వెంకటరత్నం, రొటేరియన్లు యార్లగడ్డ రాజగోపాల్, శ్రీనివాస్, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

చలసాని రాజగోపాల్‌రావుకు ఘన నివాళి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 9: నూజివీడు మండలం వెంకటాద్రిపురంలో చలసాని రాజగోపాలరావు 74వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ నాడు కమ్యూనిష్టు ఉద్యమాన్ని అణచివేయటంలో భాగంగా చేపట్టిన చర్యల్లో పోలీస్ కాల్పుల్లో ఆయన మృతి తీరని లోట న్నారు. సీపీఐ నాయకుడు బత్తుల వెంకటేశ్వరరావు, ఈమని శేషయ్య రాజగోపాలరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఆలూరి పూర్ణచంద్రరావు, సీపీఐ నాయకుడు గోళ్ళ నాగరాజు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 9: సీపీఐ సీనియర్ నాయకుడు చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. నూజివీడు అమర్‌భవన్‌లో పార్టీ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు చలసాని వెంకట రామారావు, నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు ఈమని శేషయ్య, చలసాని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.